గురువారం
04-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 73
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంఫ్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

అవి దోపిడీ చట్టాలు

- కార్మిక హక్కుల్ని హరించారు
- లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల నిరసన
- కొత్త చట్టాలు తక్షణం రద్దు చేయాలి
- ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక డిమాండ్

న్యూదిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కారు నియంతృత్వ పద్ధతుల్లో తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపీలు బుధవారం పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సహా అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. తక్షణం కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, వామపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంటు మకర ద్వారం ముందు జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఖర్గే కేంద్రంపై విరుచుకుపడ్డారు. మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వమని విమర్శించారు. ప్రతిపక్షాల నిరసన తర్వాత ఖర్గే ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. కొత్త కార్మిక కోడ్ల అమలుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు ప్రాంగణంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపాయని పేర్కొన్నారు. "కొత్త కోడ్‌లలో కొన్ని తీవ్రమైన అభ్యంతరాల్లో ఉద్యోగ భద్రతకు ముప్పు ఒకటి. లేఆఫ్ పరిమితిని 100 నుండి 300 మందికి పెంచారు. అంటే భారతదేశంలోని 80% కంటే ఎక్కువ కర్మాగారాలు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను తొలగించవచ్చు. కొత్త నిబంధనలు ఉద్యోగ భద్రతను తగ్గిస్తుంది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు, దీర్ఘకాలిక ప్రయోజనాలను తప్పించుకోవచ్చు" అని ఖర్గే అన్నారు. కొత్త నిబంధనలు 8 గంటల పని దినాన్ని కాగితంపై ఉంచినప్పటికీ, రాష్ట్రాలు సౌకర్యవంతమైన షెడ్యూలింగ్ ద్వారా 12 గంటల షిఫ్ట్‌లను అనుమతించవచ్చని ఆయన అన్నారు. "రాష్ట్రాలు నిర్ణయించిన ఓవర్‌టైమ్ పరిమితులతో కలిపి, ఇది సమర్థవంతంగా చాలా ఎక్కువ పనిదినాలను అనుమతిస్తుంది, 'ఏకాభిప్రాయం' అని లేబుల్ చేయబడినప్పటికీ భద్రతా ప్రమాదాలను పెంచుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక కార్మికులు సమ్మె చేయడానికి 60 రోజులు వేచి ఉండాలి, దానితో పాటు 14 రోజుల కూలింగ్-ఆఫ్ వ్యవధి కూడా ఉండాలి. ఇది అసురక్షిత లేదా అన్యాయమైన పరిస్థితులపై త్వరితగత చర్యను నిరోధిస్తుంది. 51% సభ్యత్వం ఉన్న ఒక యూనియన్‌ను ఏకైక సంధానకర్తగా ఉంచడం వల్ల చిన్న యూనియన్‌లను పక్కన పెడతారు. విభిన్న కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం తగ్గుతుంది" అని ఖర్గే అన్నారు. 300 కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న యూనిట్లకు స్టాండింగ్ ఆర్డర్లు వర్తించవని ఆయన ఎత్తి చూపారు. "పని గంటలు, సెలవులు, తొలగింపులపై ప్రాథమిక నియమాలు తప్పనిసరి కాదు. ఇది మధ్య తరహా యూనిట్లలో ఏకపక్ష నియామకం, తొలగింపు పద్ధతులను పెంచుతుంది" అని హెచ్చరించారు. కొత్త కార్మిక కోడ్‌లు కార్మికుల భద్రత, సంక్షేమాన్ని బలహీనపరిచాయని ఖర్గే అన్నారు. ఇక వలసదారులకు రక్షణ కల్పించడంలో కోడ్ విఫలమైంది, స్థానభ్రంశం భత్యాన్ని తొలగించి రూ. 18,000 ఆదాయ పరిమితిని నిలుపుకుంది. దీని వల్ల చాలా

- మిగతా 2 లో

భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్ల మృతి

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ అడవుల్లో తుపాకీల మోత ఆగడం లేదు. వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. బీజాపూర్-దంతెవాడ జిల్లాల పరిధిలో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. ముగ్గురు జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు బస్తర్ ఐజీ సుందరరాజ్ వెల్లడించారు. దంతెవాడ, బీజాపూర్ నుంచి డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, పోలీసులు, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ సంయుక్త అధ్వర్యంలో ఆపరేషన్ జరిగిందని తెలిపారు. 12 మంది మావోయిస్టుల మృత దేహాలను, ఎస్ఎల్ఆర్‌లు, ఇన్‌సాస్ రైఫిళ్లు, పాయింట్ 303 రైఫిళ్లు, ఇతర మందుగుండు సామగ్రిని ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అమర జవాన్లను డీఆర్‌జీ బీజాపూర్ హెడ్ కానిస్టేబుల్ మోను వదాదీ, కానిస్టేబుల్ దుకారు గోండె, జవాన్ రమేశ్ సోడీగా గుర్తించారు. గాయపడిన ఇద్దరు జవాన్లకు ప్రాణాపాయం లేదన్నారు. చనిపోయిన మావోయిస్టులు ఎవరన్నది గుర్తించాల్సి

- మిగతా 2 లో



వివేకా హత్య కేసు దర్యాప్తుపై 10న తీర్పు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో సునీతారెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన కోర్టు

- మిగతా 2 లో

ఏపీ రాజ్ భవన్ పేరు మార్పు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీలోని రాజ్‌భవన్‌కు లోక్‌భవన్‌గా పేరు మార్చారు. పేరు మార్పునకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రాబోతున్నాయి. ఇకపై విజయవాడలో రాజ్‌భవన్ కాస్తా లోక్ భవన్‌గా దర్శనమివ్వబోతోంది. వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు... రాజ్‌భవన్, రాజ్ నివాస్ పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌గా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా, తెలంగాణ రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కూడా చేరింది.

ఈపీఎస్ పింఛను పెంచం: కేంద్రం

న్యూదిల్లీ: ఉద్యోగుల పింఛను నిధి పథకం (ఈపీఎస్) ఆదాయం పెరుగుతున్నా... లబ్ధిదారులు కనీస పింఛను పెంపునకు నోచుకోక అవస్థలు పడుతున్నారు. కనీస పింఛను మొత్తాన్ని రూ. 1,000 నుంచి రూ. 7,500కు పెంచాలని ఈపీఎస్-95 పథకానికి చెందిన వేలమంది పింఛనుదారులు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని తాజాగా పార్లమెంట్‌లోనూ ఓ సభ్యుడు లేవనెత్తారు. అయితే, పెన్షన్ పెంచే ప్రతిపాదనేదీ లేదని కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే వెల్లడించారు. 'ఉద్యోగుల పింఛను

- మిగతా 2 లో

ఏపీ టెట్ హాల్ టికెట్ల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) హాల్ టికెట్లు బుధవారం నుంచి అందుబాటులో ఉంచారు. ఈనెల 10 నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. టెట్ కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి నేతృత్వంలో పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ పరీక్షల కోసం అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 2,41,509 మంది అభ్యర్థులు 2,71,682 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ప్రతి రోజూ రెండు

- మిగతా 2 లో

పదేళ్లలో 20 లక్షల ఇళ్లు

- కాళేశ్వరం కూలేశ్వరమైంది
- గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- ప్రజా పాలన విజయోత్సవాల సభలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్దిపేట/హుస్నాబాద్: పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు కట్టిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజా విజయోత్సవాల పాలన సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నెహ్రూ భూమి పూజ చేసిన ఎస్సారెస్పీ, నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తే నేడు తరతరాలుగా ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం ప్రాజెక్టుగా మారిందని ఘాటుగా విమర్శించారు. హుస్నాబాద్ గడ్డ పోరాటాల పురిటిగడ్డని... నాడు దేశ్‌ముఖ్ దొరల పెత్తందారులను ఎదిరించి, తరిమి కొట్టి మట్టి కరిపించిన సర్దార్ సర్వాయి పాపన్న పుట్టిన నేలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజల పాత్ర అమోఘమని, కరీంనగర్ జిల్లా వేదికగా సోనియమ్మ ఇచ్చిన మాట ప్రకారంగా 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిలబెట్టారన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించామని చెప్పారు. డిసెంబరు 3 కు ప్రత్యేకత ఉందని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి అసువులు బాశారని, అదే రోజు ఓటును వజ్రాయుధంగా మలుచుకొని దుర్మార్గపు బీఆర్ఎస్ పాలనకు అంతం పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు అని సీఎం రేవంత్ తెలిపారు. రెండున్నర ఏళ్లలో 60 వేల ఉద్యోగాలు ఇవ్వడమే

- మిగతా 2 లో

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేయండి

- ప్రధాని సహా ప్రముఖులను ఆహ్వానించిన రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రంలో అభివృద్ధి పథకాలకు సహకరించాలని విజ్ఞప్తి
- ఖర్గే, రాహుల్, ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించేందుకు రాష్ట్ర మంత్రివర్గం దిల్లీలో పర్యటిస్తోంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ ప్రధానిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. పార్లమెంటులో ప్రధానితో జరిగిన ఈ భేటీలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ప్రధాని మోదీకి సీఎం రేవంత్ అందించారు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా... 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్ సంకల్పంతో ముందుకు సాగుతుందని ప్రధాన మంత్రికి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్ ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు చెప్పారు. నీతి అయోగ్ సలహాలు, సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు సీఎం ప్రధానికి వివరించారు. తెలంగాణ

- మిగతా 2 లో

యాప్ తప్పనిసరి నిబంధన రద్దు: కేంద్రం

న్యూదిల్లీ: భారత్‌లో కొత్తగా తయారు చేసే మొబైల్ ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరేమీ కాదని కేంద్రం తెలిపింది. యాప్ ప్రీ-ఇన్‌స్టాలేషన్‌ను తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు టెలికమ్యూనికేషన్ల శాఖ బుధవారం ప్రకటించింది. యాప్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకున్నట్లు వివరించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల తర్వాత స్వచ్ఛందంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న సంఖ్య ఒక్కరోజులోనే పదింతలు పెరిగిందని డీఓటీ తెలిపింది. 1.4 కోట్ల మంది ఇప్పటికే ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించింది. గడచిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చిన్న పొరపాటు జరిగింది సార్! నకిలీ మనుషుల్ని అరెస్టు చేసేసాం!



తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు చైర్మన్‌గా చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు చైర్మన్‌గా చాడ వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు సమావేశం రావి నారాయణరెడ్డి ఆడిటోరియం లైబ్రరీ హాలులో పల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ట్రస్టు కార్యదర్శి కందిమళ్ల ప్రతాప రెడ్డి చేపట్టిన... చేపట్టాల్సిన కార్యక్రమాలపై నివేదిక ఇచ్చారు. సభ్యులు చాడ వెంకటరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, బొమ్మగాని ప్రభాకర్, రావి ప్రతిభ, కె.శ్రీనివాస్ రెడ్డి, ఎస్.వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ శత వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబరు 26న ఆడిటోరియంలో బహిరంగ సభ జరపాలని, తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఫొటోలతో... పోరాట ఘట్టాలతో ఆడిటోరియం

- మిగతా 2 లో

రోడ్డెక్కిన జర్నలిస్టులు

- సమస్యల పరిష్కారానికి డిమాండ్
- హైదరాబాద్‌లో టీయూడబ్ల్యూజే మహాధర్నా
- రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకుడికి వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కారాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట బుధవారం మహా ధర్నా నిర్వహించింది. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమని సీనియర్ జర్నలిస్టులు వ్యాఖ్యానించారు. 12 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏ పాల్గొన్నాయి. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి జర్నలిస్టులు హాజరయ్యారు. సమస్యల పరిష్కారం కోసం డిమాండ్- నినాదాలతో మహానగరాన్ని మార్మోగించారు. రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. మహాధర్నానుద్దేశించి ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎంఏ మజీద్, జాతీయ కార్యదర్శి వై.నరేందర్

- మిగతా 2 లో

ఈ తారలు... దర్శకులకు విశేష ప్రజాదరణ

2025 సంవత్సరానికి ప్రకటించిన ఐఎండీబీ

విశాలాంధ్ర-హైదరాబాద్ : సినిమాలు, టీవీ షోలు, సెలబ్రిటీల సమాచారానికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన, ప్రామాణికమైన వేదిక ఐఎండీబీ... 2025 సంవత్సరానికి అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ తారలు, దర్శకుల జాబితాను ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 కోట్లకు పైగా నెలవారీ సందర్శకుల 'పేజీ వీక్షణల' ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ దర్శకుడిగా నిలిచిన మోహిత్ సూరి దర్శకత్వం వహించిన రొమాంటిక్ డ్రామా చిత్రం 'సయ్యారా'లో తమ అద్భుతమైన నటనతో, వర్ధమాన తారలు అహాన్ పాండే, అనీత్ పడ్డా

- మిగతా 2 లో

యుద్ధానికి కాలుదువ్వితే వెనక్కు తగ్గం

యూరప్‌కు పుతిన్ హెచ్చరిక

మాస్కో: 'యుద్ధాన్ని కోరుకోవద్దు... ఒక్కసారి యుద్ధం మొదలైతే శాంతి చర్చల అవకాశం కూడా లేకుండానే ముగించేస్తాం' అని యూరప్‌ను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గట్టిగా హెచ్చరించారు. యూరోప్ శక్తులను ఓడించే సత్తా రష్యాకు ఉన్నదన్నారు. ఉక్రెయిన్‌తో నాలుగేళ్లుగా రష్యా యుద్ధం చేస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో అతిభయంకర పోరుగా ఇది నిలిచింది. యూరోపియన్ దేశాలు, అమెరికా అండదండలతో రష్యాను ఉక్రెయిన్ దీటుగా ఎదుర్కొంటున్నది. దీంతో ఆ దేశం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మాస్కో వశం కాలేదు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో పుతిన్ గెలిస్తే నాటో సభ్యదేశంపై దాడి చేస్తారని ఉక్రెయిన్, యూరప్ శక్తులు చాలా సార్లు హెచ్చరించాయి కానీ ఇది అర్థంలేని వాదనంటూ పుతిన్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూనే ఉన్నారు. రష్యాపై యుద్ధానికి యూరప్ సిద్ధమవుతున్నట్లు హంగరీ విదేశాంగ మంత్రి పీటర్ స్జిజార్తో హెచ్చరించిన నేపథ్యంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు పుతిన్ స్పందిస్తూ 'యూరప్ ఆకస్మికంగా యుద్ధాన్ని మొదలు పెడితే... అది ఎంత వేగంగా ముగుస్తుందంటే, చర్చలు జరిపే అవకాశం కూడా లభించదు' అని అన్నారు. ఉక్రెయిన్‌లో జరిగేది పూర్తి స్థాయి యుద్ధం కాదని, రష్యా లక్షిత దాడులు మాత్రమేనని చెప్పారు. యూరప్ యుద్ధానికి కాలుదువ్వితేగనుక తాము వెనక్కి తగ్గబోమని పుతిన్ తెల్చిచెప్పారు. రష్యాతో తెగతెంపులు చేసుకున్నందునే ఉక్రెయిన్ శాంతి చర్చల్లో యూరప్ భాగస్వామ్యం కావడంలేదని అన్నారు. యూరప్‌ది యుద్ధ పక్షమని పుతిన్ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో రష్యాకు చెందిన షాడో ఫ్లీట్ ట్యాంకర్లపై డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా సముద్రాన్ని వినియోగించుకునే అవకాశం ఉక్రెయిన్‌కు లేకుండా చేస్తామని హెచ్చరించారు.

ఆపిన ప్రతి యుద్ధానికో నోబెల్: ట్రంప్

వాషింగ్టన్: 'భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ముగించాం. ఎనిమి ది యుద్ధాలకు తెరదించాం. అందుకోసం నోబెల్ పురస్కారం ఇవ్వాలి. మరో యుద్ధాన్ని కూడా ముగించబోతున్నాం (రష్యా-ఉక్రెయిన్‌నుద్దేశించి)' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కేబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నేను యుద్ధాన్ని ఆపిన ప్రతిసారి... ఇది కూడా ఆపితే నోబెల్ వరిస్తుందని చెబుతున్నారు. అలా ఒక దాని తర్వాత ఒకటిగా యుద్ధాలు ఆపుతున్నాను తప్ప నోబెల్ వరించలేదు. ఇప్పుడేమో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తే తప్పకుండా నోబెల్ పురస్కారం లభిస్తుందని చెబుతున్నారు. మరి మిగతా ఎనిమిది యుద్ధాల సంగతేమిటి? నేను ఆపిన ప్రతి యుద్ధానికో నోబెల్ పురస్కారం నాకు లభించాలి కానీ నేను అంత అత్యాసకు పోను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-పాక్ యుద్ధం తన వల్ల ఆగిందని మే 10 నుంచి కనీసం 60సార్లకుపైగా ట్రంప్ చెప్పుకున్నారు.

10న తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

తీర్పును రిజర్వు చేసింది. దీనిపై ఈ నెల 10న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. వివేకానందరెడ్డి హత్య జరిగి ఏడేళ్లవుతున్నా ఇప్పటికీ సీబీఐ ఏమీ తేల్చలేకపోయింది. పైగా ఈ కేసులో తమ దర్యాప్తు ముగిసిందంటూ సీబీఐ నేరుగా సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి కుమార్తె సునీత మరలా కోర్టును ఆశ్రయించడంతో ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో సునీత హైదరాబాద్ సీబీఐ కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి హత్యపై సీబీఐ జరిపిన దర్యాప్తు సంతృప్తి కరంగా లేదని, ఈ కేసులో మరింత సమగ్ర దర్యాప్తు అవసరమంటూ సునీతారెడ్డి కోర్టును కోరారు. ఆమె పిటిషన్‌పై సీబీఐ కోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సునీత తరపున న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపించారు. వివేకా హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలు దోషులు తప్పించుకునే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. అలాగే ఈ కేసులో ఇప్పటికే దాఖలు చేసిన ఛార్జిషీట్‌కు అదనంగా అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలా చేస్తేనే ఈ కేసులో ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. వాదనలు విన్న సీబీఐ కోర్టు తీర్పును 10వ తేదీ వెల్లడిస్తామని ప్రకటించింది.

శ్రీలంకకు భారత్ వైద్య సాయం

కొలంబో: దిత్వా తుపాను సృష్టించిన బీభత్సానికి అతలాకుతలమైన శ్రీలంకకు భారత్ ఆపన్నహస్తం అందించింది. మొబైల్ ఫీల్డ్ హాస్పి టల్‌తో పాటు 70 మంది వైద్య సిబ్బందిని ద్వీప దేశానికి మానవతా సాయంగా పంపింది. ఈ మేరకు ఇండియన్ మిషన్ బుధవారం వెల్లడించి ంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు తోడు కొండచరియలు విరిగి పడిన ఘటనలతో శ్రీలంకకు తీవ్ర ఆస్తి-ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటివరకు 465 మంది చనిపోగా, 366 మంది ఆచూకీ లేరని అధికారులుత తెలిపారు. శ్రీలంకకు భారత్ అత్యవసర సాయం కింద ఫీల్డ్ ఆసుపత్రి, 70 మందికిపైగా వైద్య సిబ్బందిని పంపినట్లు ఇండియన్ హై కమిషన్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది. ఐఏఎఫ్ సీ17 గ్లోబ్‌మాస్టర్ విమానం పారా ఫీల్డ్ ఆసుపత్రితో పాటు ఆగ్రా నుంచి 73 మంది వైద్య సిబ్బందిని ఎయిర్‌లిఫ్ట్ చేసినట్లు తెలిపింది. ఐఏఎఫ్ ఎంఐ17 హెలికాప్టర్లు ఇప్పటికే సేవలు అందిస్తున్నాయి. ఎనిమిది టన్నులకుపైగా సహాయ సామగ్రిని ఎయిర్‌లిఫ్ట్ చేశాయి. 65 మందిని కాపాడాయి. వీరిలో విదేశీ పౌరులు, గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారు ఉన్నారు. శ్రీలం కలో అనేక చోట్ల భారతీయ సిబ్బంది సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు మిషన్ వెల్లడించింది. కొల ంబో సమీపంలోని సెదావత్తా, నదీగమ ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. 8-10 అడుగుల లోతైన వరద నీటిలో చిక్కుకుపోయిన వారి ప్రాణాలు కాపాడటంలో నిమగ్నమయ్యాయి. 43 మందికిపైగా బాధితులను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకకు భారత్ అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు ఇండియన్ హై కమిషన్ వెల్లడించింది.

నేడు భారత్‌కు పుతిన్

మాస్కో/న్యూదిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ చేరుకోనున్నారు. ఆయన గురు-శుక్రవారాలు న్యూదిల్లీలో పర్యటిస్తారు. అత్యుత్తమ శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది రష్యా అధ్యక్ష భద్రతా సేవల దళం నుంచి ఆయన వెంట రాబోతోంది. భారత ఎన్ఎస్‌జీ కమాండోలు కూడా పుతిన్‌కు భద్రత కల్పిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో భారత్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, ఏఐ నిఘా వంటి ఐదు అంచల నిఘా వలయాన్ని సిద్ధం చేసింది. పుతిన్ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు. 4వ తేదీ సాయంత్రం ఆయన దిల్లీ చేరుకుంటారు. ప్రధానితో కలిసి రాత్రి భోజనం చేస్తారు. ఆపై రాష్ట్రపతి భవన్‌లో గౌరవ ఆతిథ్యం స్వీకరిస్తారు. శుక్రవారం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తారు. ఆపై హైదరాబాద్ హౌస్‌లో జరిగే సదస్సుతో పాటు భారత్ మండపంలో కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ము విందులో పాల్గొంటారు. పుతిన్ బస చేయబోయే హోటల్‌ను శానిటైజ్ చేసి సిద్ధం చేశారు. రష్యా భద్రతా అధికారులు ఇప్పటికే ముందస్తు తనిఖీలు నిర్వహిస్తారు. పుతిన్ పర్యటనలో భాగంగా భారత్-రష్యా మధ్య పౌర అణు సహకార ఒప్పందం జరగబోతోంది. రష్యా డ్యూమా ఇప్పటికే దీనిని ఆమోదించింది. వాణిజ్యం, రక్షణ, ఇతర రంగాల్లోనూ ఒప్పందాలకు పుతిన్-మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థల ఒప్పందంపైనా సంతకం చేయనున్నట్లు సమాచారం.

అవి దోపిడీ చట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

మంది వలసదారులు రక్షణ లేకుండా పోయారన్నారు. తప్పనిసరి ఆధార్ ఆధారిత రిజిస్ట్రేషన్ కారణంగా వలసదారులు, అనధికారిక కార్మికులు తరచుగా డాక్యుమెంటేషన్ లోపాలు లేదా పరిమిత డిజిటల్ యాక్సెస్‌ను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. సామాజిక భద్రతా నమోదుకు అడ్డంకులను సృష్టిస్తుందని ఖర్గే స్పష్టం చేశారు.

నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ కార్మిక చట్టాలను సరళీకృతం చేయడం పేరుతో కేంద్ర ప్రభుత్వం నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను తీసుకువచ్చిందని, అయితే ఈ సాకుతో ప్రభుత్వం కార్మికుల అన్ని హక్కులను లాక్కుందని మండిపడ్డారు. "గతంలో కార్మికులకు ఇచ్చిన రక్షణ తీసివేయబడింది. వారి దోపిడీకి కొత్త మార్గాలు తెరవబడ్డాయి. ఈ చట్టాల ద్వారా, నరేంద్ర మోడీ జీ పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక మనస్తత్వం మరోసారి తెరపైకి వచ్చింది. దేశం ఈ చట్టాలను అంగీకరించదు" అని ఆమె నిరసన తర్వాత హిందీలో 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఆ చట్టాలను ఆమె "దోపిడీ చట్టాలు"గా విమర్శించారు. కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పోస్టర్లు, ప్లకార్డులు పట్టుకుని, ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేశారు. వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

ఖర్గేతో పాటు, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, టీఎంసీకి చెందిన డోలా సేన్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎ.రాజా,సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన సుదామ ప్రసాద్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్‌కు నో, లేబర్ జస్టిస్‌కు యస్' అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను కూడా ఎంపీలు ప్రదర్శించారు.

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు చైర్మన్‌గా చాడ వెంకటరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

పైన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీపీఐ శత వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబరులో సదస్సుల నిర్వహణ బాధ్యతలు ట్రస్టు సభ్యులు బి.ప్రభాకర్, కాంతయ్యకు ఇచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్న సురవరం సుధాకర్ రెడ్డి మరణించినందున... వారి స్థానంలో ట్రస్టు చైర్మన్‌గా చాడ వెంకటరెడ్డిని, కోశాధికారిగా రావి ప్రతిభను ఎన్నుకున్నారు. అమరవీరుల ఎగ్జిబిషన్ నిర్వహణకు ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, డా. లక్ష్మణ్ కు బాధ్యతలు అప్పగించారు. ఆడిటోరియంలో లైబ్రరీ నిర్వహణ బాధ్యతలను కె.లక్ష్మణరావు కు ఇచ్చారు.చేసుకున్నారు. కెరీర్‌లో గొప్ప మలుపు తిప్పుకోబోయే తారలను కచ్చితంగా అంచనా వేయడంలో పేరుగాంచిన ఐఎండీబీ 'బ్రేక్-అవుట్ స్టార్' స్టార్‌మీటర్ అవార్డును గత ఆగస్టులో అహాన్, అనీత్ అందుకోవడం విశేషం. 'మా వార్షిక అత్యంత ప్రజాదరణగల భారతీయ తారల' ర్యాంకింగ్‌తో పాటుగా ఈ ఏడాది తొలిసారిగా 'ఐఎండీబీ అత్యంత ప్రజాదరణగల భారతీయ దర్శకుల' జాబితాను ప్రవేశపెడుతున్నాము' అని ఐఎండీబీ ఇండియా హెడ్ యామిని పటోడియా తెలిపారు.

'25 ఏళ్ల భారతీయ సినిమా ఐఎండీబీ పరిశ్రమ నివేదిక' లో భారతీయ చలనచిత్ర రంగానికి సంబంధించిన ఈ కొత్త శకానికి దర్శకులే కీలక రూపకర్తలుగా మారడాన్ని మేము ప్రముఖంగా ప్రస్తావించాము. నటీనటులతో సమానంగా దర్శకులు కూడా ఇప్పుడు మా వారాంతపు ర్యాంకింగ్స్‌లో నిలకడగా స్థానం సంపాదిస్తున్నారు. కథా ప్రపంచాన్ని సృష్టించడం, కథ చెప్పే విధానం అభిమానాన్ని పెంచే కొత్త సాధనాలుగా మారడంతో, దర్శకులు కూడా స్వయంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నారని ఇది సూచిస్తోంది' అని తెలిపారు. అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ అహాన్ పాండే మాట్లాడుతూ 'ఇది నాకు ఎంతో ఉద్విగ్నకరమైన విషయం. నా మొదటి చిత్రంతోనే '2025 ఐఎండిబి అత్యంత ప్రజాదరణగల భారతీయ తారల' జాబితాలో నంబర్ 1 స్థానంలో నిలవడం నిజంగా ఒక కల నెరవేరడం లాంటిదన్నారు.

ఐఎండీబీ 2025 అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ తారల జాబితాలో అహాన్ పాండే, అనీత్ పడ్డా, ఆమిర్ ఖాన్, ఇషాన్ ఖట్టర్, లక్ష్య, రష్మిక మందన్నా, కల్యాణి ప్రియదర్శన్ త్రిప్తి డిమ్రి, రుక్మిణి వసంత్, రిషబ్ శెట్టిలు ఉన్నారు. ఐఎండీబీ 2025లో అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ దర్శకులలో మోహిత్ సూరి, ఆర్యన్ ఖాన్, లోకేశ్ కనగరాజ్, అనురాగ్ కశ్యప్, పృథ్వీరాజ్ సుకుమారన్, ఆర్.ఎస్.ప్రసన్న, అనురాగ్ బసు, డోమినిక్ అరుణ్, లక్ష్మణ్ ఉటేకర్, నీరజ్ ఘేవాన్ల ఉన్నారు.

రేపటి నుంచి హైదరాబాద్‌లో ఫిలిం ఫెస్టివల్

విశాలాంధ్ర-హైదరాబాద్ : సినీ, సాంస్కృతిక ప్రయాణాన్ని జరుపుకుంటూ తన 30వ ఎడిషన్‌తో ఈయుడబ్ల్యూఎఫ్ మరోసారి హైదరాబాద్‌కు చేరుతోంది. యూరప్-భారతదేశాల మధ్య జరుగుతున్న కళాత్మక, సాంస్కృతిక పరస్పర మార్పిడిని ప్రతిబింబించే ఈ ఫిలిం ఫెస్టివల్, దిల్లీ, బెంగళూరులో విజయవంతమైన ప్రదర్శనల అనంతరం, సినిమాను ప్రేమించే హైదరాబాద్ ప్రేక్షకులకు యూరోపియన్ అత్యుత్తమ చిత్రాలను అందించేందుకు సిద్ధమైంది.

డిసెంబరు 5 నుంచి 14, 2025 వరకు జరగనున్న ఈ ఉత్సవాన్ని డచ్ దర్శకుడు జెల్లె డె జోంగ్ రూపొందించిన 'మెమరీ లేన్' చిత్రంతో ప్రారంభించనున్నారు. మరణం, వివాహం, ప్రేమ, మనస్పర్థలు సమసిపోవడం, విడిచిపెట్టే కళ వంటి భావోద్వేగాలను సున్నితంగా పలికించే ఈ చిత్రం ప్రారంభ ప్రదర్శనగా నిలవబోతోంది. భారతదేశంలోని యూరోపియన్ యూనియన్ రాయబారి హెర్వే డెల్ఫిన్ మాట్లాడుతూ గత సంవత్సరం హైదరాబాద్‌లో ఫెస్టివల్‌కు లభించిన అద్భుతమైన స్పందనను దృష్టిలో పెట్టుకొని, ఈసారి తిరిగి ఇక్కడికి రావడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నగరం సినిమాను ప్రేమించడమే కాదు ప్రతి రూపంలోనూ కథ చెప్పడాన్ని ఆస్వాదించే అసాధారణమైన అలవాటు దీనికి ఉందని తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

రైజింగ్ విజన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని సీఎం ప్రధానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు తగిన అనుమతులు ఇవ్వాలని కోరారు. మొత్తం 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేబినెట్ ఆమోదంతో పాటు ఆర్థిక ఆమోదం ఇవ్వాలని, దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు వెంట ప్రతిపాదనల్లో ఉన్న రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును వీలైనంత తొందరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగళూరు హై స్పీడ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరాయంగా రవాణా సదుపాయం ఉండేలా టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు నాలుగు వరసల ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధాన మంత్రికి సీఎం రేవంత్ వినతి పత్రం అందించారు.

ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా ప్రముఖులకు ఆహ్వానం

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి న్యూదిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ఎంపీ ప్రియాంక గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన ఉమ్మడి లక్ష్యాలను పంచుకుంటూ వారితో కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 8, 9 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనవలసిందిగా రాహుల్ గాంధీని, ప్రియాంక గాంధీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధిని లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి అగ్ర నేతలకు వివరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎంపీలు, ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు.

సీఎంలను ఆహ్వానించే బాధ్యత మంత్రులకు

డిసెంబరు 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. స్వయంగా రాష్ట్ర మంత్రులు వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి ఈ సదస్సుకు ఆహ్వానిస్తారు. ఎవరెవరు ఏ ఏ రాష్ట్రాలకు వెళ్లాలో సీఎం నిర్ణయించారు. ఈ నెల 4న మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. జార్ఖండ్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జమ్మూకశ్మీర్, గుజరాత్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్, హర్యానాకు దామోదర్ రాజనర్సింహ, ఆంధ్ర ప్రదేశ్, కేరళకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్నాటక, తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తర ప్రదేశ్‌కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్, చత్తీస్‌గఢ్‌కు కొండ సురేఖ, పశ్చిమ బెంగాల్‌కు సీతక్క, మధ్య ప్రదేశ్‌కు తుమ్మల నాగేశ్వరరావు, అసోంకు జూపల్లి కృష్ణారావు, బీహార్‌కు వివేక్ వెంకటస్వామి, ఒడిశాకు వాకిటి శ్రీహరి, హిమాచల్ ప్రదేశ్‌కు అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మహారాష్ట్ర, దిల్లీ సీఎంను కేంద్ర మంత్రులను, ఎంపీలను మొహమ్మద్ అజారుద్దీన్ ఆహ్వానిస్తారు.

భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు సుందరరాజ్ తెలిపారు. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రీఇన్‌ఫోర్స్‌మెంట్ బృం దాలు తనిఖీలు చేపట్టినట్లు వెల్లడిం చారు. గాలింపులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పశ్చిమ బస్తర్ మావోయిస్టు నాయకుడు పాపారావు, గంగలూరు ఏరియా కమిటీ సభ్యులతో సహా 12 మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. ఈ ఏడాది జరిగి న ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 275 మంది మావోయిస్టులు మరణించారని ఎస్పీ యాదవ్ వెల్లడించారు.

ఈ తారలు... దర్శకులకు విశేష ప్రజాదరణ

(మొదటిపేజీ తరువాయి)

మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. కెరీర్‌లో గొప్ప మలుపు తిప్పుకోబోయే తారలను కచ్చితంగా అంచనా వేయడంలో పేరుగాంచిన ఐఎండీబీ 'బ్రేక్-అవుట్ స్టార్' స్టార్‌మీటర్ అవార్డును గత ఆగస్టులో అహాన్, అనీత్ అందుకోవడం విశేషం. 'మా వార్షిక అత్యంత ప్రజాదరణగల భారతీయ తారల' ర్యాంకింగ్‌తో పాటుగా ఈ ఏడాది తొలిసారిగా 'ఐఎండీబీ అత్యంత ప్రజాదరణగల భారతీయ దర్శకుల' జాబితాను ప్రవేశపెడుతున్నాము' అని ఐఎండీబీ ఇండియా హెడ్ యామిని పటోడియా తెలిపారు. '25 ఏళ్ల భారతీయ సినిమా ఐఎండీబీ పరిశ్రమ నివేదిక' లో భారతీయ చలనచిత్ర రంగానికి సంబంధించిన ఈ కొత్త శకానికి దర్శకులే కీలక రూపకర్తలుగా మారడాన్ని మేము ప్రముఖంగా ప్రస్తావించాము. నటీనటులతో సమానంగా దర్శకులు కూడా ఇప్పుడు మా వారాంతపు ర్యాంకింగ్స్‌లో నిలకడగా స్థానం సంపాదిస్తున్నారు. కథా ప్రపంచాన్ని సృష్టించడం, కథ చెప్పే విధానం అభిమానాన్ని పెంచే కొత్త సాధనాలుగా మారడంతో, దర్శకులు కూడా స్వయంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నారని ఇది సూచిస్తోంది' అని తెలిపారు. అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ అహాన్ పాండే మాట్లాడుతూ 'ఇది నాకు ఎంతో ఉద్విగ్నకరమైన విషయం.

నా మొదటి చిత్రంతోనే '2025 ఐఎండిబి అత్యంత ప్రజాదరణగల భారతీయ తారల' జాబితాలో నంబర్ 1 స్థానంలో నిలవడం నిజంగా ఒక కల నెరవేరడం లాంటిదన్నారు. ఐఎండీబీ 2025 అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ తారల జాబితాలో అహాన్ పాండే, అనీత్ పడ్డా, ఆమిర్ ఖాన్, ఇషాన్ ఖట్టర్, లక్ష్య, రష్మిక మందన్నా, కల్యాణి ప్రియదర్శన్ త్రిప్తి డిమ్రి, రుక్మిణి వసంత్, రిషబ్ శెట్టిలు ఉన్నారు. ఐఎండీబీ 2025లో అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ దర్శకులలో మోహిత్ సూరి, ఆర్యన్ ఖాన్, లోకేశ్ కనగరాజ్, అనురాగ్ కశ్యప్, పృథ్వీరాజ్ సుకుమారన్, ఆర్.ఎస్.ప్రసన్న, అనురాగ్ బసు, డోమినిక్ అరుణ్, లక్ష్మణ్ ఉటేకర్, నీరజ్ ఘేవాన్ల ఉన్నారు.

పదేళ్లలో 20 లక్షల ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కట్టిన ఏ ఒక్క ప్రాజెక్టూ చెక్కుచెదరలేదని బీఆర్ఎస్ పార్టీ కట్టిన ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా ఉన్నాయని విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కొండపోచమ్మ, రంగనాయక సాగర్ పూర్తి చేసిన కేసీఆర్... బీఆర్ఎస్ ఎమ్మెల్యే సతీష్ బాబు ఉన్న ప్రాంతంలో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోలార్ పవర్ ప్లాంట్లతో మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రూ.1.4 లక్షల కోట్లు రైతుల కోసం, రూ.8 వేల కోట్లు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణానికి ఖర్చు చేశామన్నారు. రూ.50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే వారిని సర్పంచిగా ఎన్నుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అంతకముందు రూ.44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ఏటీసీ ఏర్పాటుకు, రూ.20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో అనేక అభివృద్ధి పనులకు, రూ.8.60 కోట్లతో ఆర్టీఏ యూనిట్ ఆఫీస్, రూ.86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్, కొత్తపల్లి ప్యాకేజీ-1 లో భాగంగా 4 వరసల రహదారి నిర్మాణానికి, రూ.58.91 కోట్లతో హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట 4 వరసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా 70 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ వెహికిల్, హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సును జెండాను ఊపి సీఎం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్ కుమార్, వీహెచ్ హన్మంతరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల రాజయ్య, ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈపీఎస్ పింఛను పెంచం

(మొదటిపేజీ తరువాయి)

నిధికి మూలధనం అనేది వేతనాల్లో యజమాని 8.33 శాతం వాటాతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పడుతుం ది. ఆ లెక్కల నుంచి వచ్చిన ఆదాయంతోనే ఈ పథకం కింద అన్ని ప్రయోజనాలు అందిస్తున్నాం. ఏటా ఈ నిధిని అంచనా వేస్తుంటారు. అయితే, ప్రస్తుతం ఆ మూల్యాంకనం ప్రకారం ఈ పింఛను నిధి లోటులో ఉంది. దీనికి సరైన రిటర్నులు రానందున... ప్రస్తుత నిబంధనల ప్రకారం కనీస పింఛను చెల్లించేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కల్పిం చాల్సి వస్తోంది' అని మంత్రి వివరించారు. దీంతో ఇప్పట్లో ఈపీఎస్ కనీస పింఛన్ పెంచే అవకాశాలు కనిపించట్లేదు.

రోడ్డెక్కిన జర్నలిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేశ్, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.నరహరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, ఉర్దూ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు ప్రసంగించారు. తొలుత దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యులైన జర్నలిస్టులు ప్రస్తుతం హక్కుల కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. మోదీ ప్రభుత్వం తొలి ప్రధాని నెహ్రూను ద్రోహిగా చిత్రీకరించి, ఆయన పేరునే రూపుమాపాలని యత్నిస్తోందన్నారు. 27 లేబర్ చాట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు అమల్లోకి తెచ్చిందని, వీటితో కారిక వర్గంతో పాటు జర్నలిస్టులకు నష్టమన్నారు. లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జర్నలిస్టుల సంఘాల తరపున అమర్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలు అరకొరగానే తీరాయని, కాంగ్రెస్ పాలనలోనే సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయన్న నమ్మకం ఉందని అన్నారు. ఏదో ఒక రోజు కిరీటాలు-సింహాసనాలు కూలుతాయని ప్రభుత్వాలు గ్రహించాలని, దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని దేవులపల్లి అమర్ హితవు పలికారు. విరాహత్ అలీ మాట్లాడుతూ అక్రిడిటేషన్ విధానాన్ని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. వృత్తిపరమైన కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అలీ డిమాండ్ చేశారు.

సమాచార శాఖ కమిషనర్లు తరచూ మారడంపై ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ దృష్టి పెట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే 33 జిల్లాల జర్నలిస్టులందరిని హైదరాబాద్ రప్పించి భారీ ఉద్యమం చేపడతామని విరాహత్ అలీ హెచ్చరించారు. రామ్ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినాగానీ జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం మాత్రం లభించడంలేదన్నారు.కమిటీల పేరుతో కాలయాపన తగదని, జర్నలిస్టుల హక్కులు వెంటనే అమలు చేయాలని రామ్ కోరారు. ధర్నాలో నాయకులు వి.యాదగిరి, కె.శ్రీకాంత్ రెడ్డి, మధు గౌడ్, ఫైసల్, ఏ.రాజేశ్ పాల్గొన్నారు.

ఏపీ టెట్ హాల్ టికెట్ల విడుదల

(మొదటిపేజీ తరువాయి)

విడతలుగా పరీక్షలు జరుగుతాయి. మొదటి విడత ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ విడత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే టెట్ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంది. దీంతో పెద్దఎత్తున ఈ విడత నిరుద్యోగ ఉపాధ్యాయులతోపాటు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. ఏపీ టెట్ 2025 వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్ తప్పనిసరి నిబంధన రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క రోజులైనే 6 లక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని తెలిపింది. వినియోగదారుల సంఖ్య శీఘ్రగతిని పెరుగుతోందని చెప్పింది. యాప్‌ను తప్పనిసరి చేయడం వెనుక ఈ ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజలందరికీ తేలిగ్గా తెలుసుకునే అవకాశం కల్పించడం తమ ఉద్దేశమని డీఓటీ ఆ ప్రకటనలో వివరించింది. సంచార్ సాథీకి పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ముందస్తు ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించినట్టు పేర్కొంది.

రోడ్డు పనులు పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులను సకాలంలోగా పూర్తి చేయాలని అన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు. మరమ్మత్తుల పనులన్నింటినీ నాణ్యవంతంగా చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత్ కు మరమ్మత్తులు చేయాలని తెలిపారు. పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఆటోస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో జిల్లా సంక్షేమ అధికారి సభిత అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సామాజిక బాధ్యతల పై ముఖ్య సందేశాన్ని అందించారు. దివ్యాంగుల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా మరిన్ని సంక్షేమ చర్యలను తీసుకెళ్లేందుకు అధికారి వర్గం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది అన్నారు. వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని సూచించారు. దివ్యాంగ క్రీడాకారులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓలు, సూపర్వైజర్లు, దివ్యాంగుల అసోసియేషన్స్, సంఘాల నాయకులు, సభ్యులు, పెద్దఎత్తున దివ్యాంగులు, మరియు సిబ్బంది బి. రాజు, ఎం. హరీష్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన

విశాలాంధ్ర కారేపల్లి : సింగరేణి మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైన సందర్భంగా జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి దీక్ష రైనా సింగరేణి, భాగ్యనగర్, సీతారాంపురం, కోమట్లగూడెం గ్రామపంచాయతీలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారు లతో నామినేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుంది అని తెలుసుకొని వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.జిల్లా అధికారి వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీ ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సబ్ ఎస్ ఐ బైరు గోపి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర వైరా : వైరా మండలంలో 22 గ్రామపంచాయతీలో నాలుగు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి ,మండలంలోని పుణ్యపురం ,నారపునేనిప,ల్లి లక్ష్మీపురం ,గోవిందపురం, గ్రామపంచాయతీలు ఏకగ్రీవయ్యాయి. నాలుగు పంచాయతీలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో 18 పంచాయతీలకు పోటీ జరుగుతుంది నారపునేనిపల్లి గ్రామ సర్పంచ్ గా శీలం చంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవం ఎంపికయ్యారు బుధవారం జరిగిన నామినేషన్ ఉపసహరణ కార్యక్రమంలో భాగంగా చంద్రశేఖర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గ్రామంలో 8 వార్డులు కూడా ఏకగ్రీవం అయినవి. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలకు రాజకీయ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో అదే విధంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేయూతతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు

జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ జంబోరీలో మార్గదర్శిని విద్యార్థులు

విశాలాంధ్ర - ఇల్లందు : నవంబర్ 23 నుండి 30 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో ఘనంగా నిర్వహించిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జంబోరి కార్యక్రమంలో ఇల్లందు మార్గదర్శిని పాఠశాల నుంచి తొమ్మిది మంది స్కౌట్స్, ఆరుగురు గైడ్స్ విద్యార్థులు రాష్ట్ర తరపున పాల్గొన్నారు. వీరికి పాఠశాల స్కౌట్ మాస్టర్ అజిత్ కుమార్ సారథ్యం వహించారు. ఈ జంబోరీలో దాదాపు 250 అంశాలలో వివిధ స్థాయిలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాఠశాల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని బహుమతులతోపాటు మెరిట్ సర్టిఫికెట్లు, ట్రోఫీలను గెలుపొందడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణలు ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థుల తోపాటు మాస్టర్ అజిత్ కుమార్ లను ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఇల్లందు నుండి మొదటిసారి ఈ కార్యక్రమానికి హాజరైన ఘనత ఈ పాఠశాలకే చెందుతుందన్నారు. అదేవిధంగా తమపై ఎంతో నమ్మకం ఉంచి తమ పిల్లలను దాదాపు 15 రోజులు పాటు ఈ కార్యక్రమం కోసం పంపించినందుకు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తాము విద్యార్థులకు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం తోపాటు ఇతర ఈవెంట్స్ లొ ప్రత్యేక శ్రద్ధ, శిక్షణ చూపుతున్నట్లు తెలిపారు.

రామకృష్ణాపూర్ ఓసీ ఫేజ్-2

ప్రజాభిప్రాయ సేకరణలో ఉద్రిక్తత

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఆర్కేపీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఫేజ్-2 విస్తరణకు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ పి చంద్రయ్య, తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోలర్ అధికారి లక్ష్మణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం రణరంగాన్ని తలపించింది. స్థానికుల నుండి, ముఖ్యంగా ప్రభావిత ప్రాంతాలైన ఆర్కే-4 గడ్డ, శాంతినగర్, అమరవాది నివాసుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సభ ప్రారంభం నుంచే నిర్వాసితులు అధికారుల తీరుపై మండిపడ్డారు. 'మేము ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఫేజ్-2కి వ్యతిరేకం కాదు.. కానీ అభివృద్ధి పేరుతో మా బతుకులు ఆగం చేయొద్దు' అంటూ నినదించారు.

శ్వేత పత్రం విడుదల చేయాలి..

గతంలో ఓపెన్ కాస్ట్ ఫేజ్-1 ప్రారంభం నాటి పాత హామీలే నెరవేర్చనప్పుడు, కొత్త విస్తరణకు ఎలా ఒప్పుకుంటామని నిర్వాసితులు అధికారులను నిలదీశారు. డెవలప్మెంట్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేజ్-1 లో చేపట్టిన అభివృద్ధి పనులపై తక్షణమే 'శ్వేత పత్రం' విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దత్తత పేరుతో మోసం..

సింగరేణి సంస్థ అమరవాది గ్రామాన్ని దత్తత తీసుకున్నామని గొప్పలు చెప్పుకుందే తప్ప, అక్కడ ఒక్క హామీని నెరవేర్చలేదని గ్రామస్తులు ఆరోపించారు. పొలాలకు సాగు నీరు లేక, ప్రజలకు తాగు నీరు లేక, ఆరోగ్య పరంగా, ఆర్థిక పరంగా తీవ్ర నష్టాలను చవిచూశామన్నారు. 'ఏ రోజూ ఏ ఒక్క అధికారి కూడా మమ్మల్ని సంప్రదించలేదు. మా సమస్యలని అడిగి తెలుసుకున్న పాపాన పోలేదు. కేవలం కొందరు కుల సంఘాల నాయకులు తమ స్వలాభం కోసం అధికారులకు వత్తాసు పలుకుతున్నారు, వారికి సిగ్గుండాలి' అని సభలో ఆవేశంతో రగిలిపోయారు.

మసి దిబ్బలుగా మారుతున్న కాలనీలు...

ఇప్పటికే ఉన్న ఓపెన్ కాస్ట్ గని వల్ల రామకృష్ణాపూర్, పరిసర ప్రాంతాల్లో విపరీతమైన దుమ్ము, ధూళి పెరిగిపోయిందని స్థానికులు

పాత హామీలు నెరవేర్చాకే..కొత్త విస్తరణ..

వాపోయారు. ఓసీ బ్లాస్టింగ్ శబ్దాల వల్ల ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారని మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. కనీసం మెడికల్ క్యాంపులు నిర్వహించలేదని, దుమ్ము లేవకుండా వాటర్ ట్యాంకర్లతో నీటిని చల్లలేదని మండిపడ్డారు. ఫేజ్-2 విస్తరణతో తమ కాలనీలు మసి దిబ్బలుగా మారుతాయన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే..

ఈ సందర్భంగా పలువురు పట్టణ, యూనియన్ నాయకులు మాట్లాడుతూ..గత 15 సంవత్సరాల క్రితం కార్మికులతో కళకళలాడిన ప్రాంతం ఇదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆర్కే-4 గడ్డ ప్రాంత వాసులు దుబ్బ బుక్కి బ్రతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సింగరేణి అధికారులు స్పందించి, కాలనీవాసులకు 'ఆర్ అండ్ ఆర్' (పునరావాస) ప్యాకేజీని అమలుపరచాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఇండ్ల స్థలాలను అందజేయడంతో పాటు వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వైద్య సదుపాయాలను కల్పించాలని కోరారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నిజామాబాద్ : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ తోడ్పాటు సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో విజయాలను సాధించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఆయా రంగాల్లో దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తూ వారిని కొనియాడారు. విద్యా, రాజకీయ రంగాలతో పాటు క్రీడలు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు, ఏ రంగంలో చూసినా దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని, దివ్యాంగులను వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయల ప్రోత్సాహకం అందిస్తోందని గుర్తు చేశారు. స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే వారికి తక్షణ ఆర్థిక సాయం అందేలా చొరవ చూపుతోందని తెలిపారు. భవిత కేంద్రాలతో పాటు నిజామాబాద్ నగరంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని, సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు ఉంటే తొలగిస్తామని, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన సమయాలలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు సముచిత ప్రాధాన్యత దక్కేలా జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. నగరంలోని దివ్యాంగుల సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రూ. 12.5 లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమూర్తి, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, మమత, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూతి వెంకటేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర -వైరా : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంటుంది. దాని పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వైరా మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నూతి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ పరిధిలోని అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారంలో తనవంతుగా కృషి చేస్తానని ఏకగ్రీవ సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు

నామినేషన్ కేంద్రాలు సందర్శన

విశాలాంధ్ర తల్లాడ : గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. తల్లాడ మండలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలన్నారు.

ప్రాథమికపాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-బోనకల్ : మండలంలోని చొప్పకట్లపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె విజయభాస్కర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల హాజరును పరిశీలించారు. కలెక్టర్ గారి అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ ప్రోగ్రామ్ ను కూడా పరిశీలించారు. ఇక్కడ 80% నుండి 90% వరకు పిల్లలు చదువుకుంటున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ ఆఫీసర్ కు నివేదించారు.విద్యార్థులకు స్కూల్ లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా స్పెషల్ ఆఫీసర్ పరిశీలించారు. ఇక్కడ ఉన్నటువంటి 40 మంది పిల్లలకు ఈ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, నాణ్యతతో అందిస్తున్నట్లు తనిఖీ అధికారులు గమనించారు. తమ పిల్లలకు అందిస్తున్న తరహాలోనే పాఠశాల సిబ్బంది చాలా శ్రద్ధతో వంట చేశారని ప్రశంసించారు. అదేవిధంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బోనకల్ మండలంలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

దివ్యాంగుల పట్టుదల సంకల్పానికి సలాం

విశాలాంధ్ర - మణుగూరు : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో పివి కాలనీ భద్రాద్రి స్టేడియంలో బుధవారం దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. దివ్యాంగుల ప్రతిభ, పట్టుదల, సంకల్పానికి సలాం చెప్పాలని ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ అన్నారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, వారిలోని ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజరైన ఆమె అంగవైకల్యం లక్ష్యం సాధనకు అడ్డంకి కాదని ఈ క్రీడాల్లో దివ్యాంగులు నిరూపించారని కొనియాడారు. దివ్యాంగ పిల్లలు ఉద్యోగం, విద్య, క్రీడలలో రాణించాలంటే ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రముఖులు ప్రోత్సాహం ఎంతో అవసరం అన్నారు. సింగరేణి సంస్థ ప్రతి ఏడాది దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అధికారులు దివ్యాంగ పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో డిజిఎం ఎస్. రమేష్, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టీయూసి వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, సిఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి.మధన్ నాయక్, ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, సత్య సాయి దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు, సేవ సెక్రటరీ షాకిర బేగం, సేవ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి: సీఐ

విశాలాంధ్ర-పినపాక : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగేలా రాజకీయ నాయకులు, గ్రామస్తులు సహాయ, సహకారాలు అందించాలని సీఐ వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం పినపాక మండలంలోని సీతారాంపురం గ్రామంలో డి.ఎస్.పి ఆదేశాల మేరకు సిఐ తోపాటు ఎస్సై సురేష్ లు ఎన్నికల నియమావాలి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, దాడులు, అల్లర్లు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా ముందుకు రావాలన్నారు. ఎవరైనా భయపెట్టినా ప్రలోభాలకు గురిచేసిన తమకు సమాచారం ఇవ్వాలని పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారానికి స్పీకర్లు, మైకులు, పోస్టర్లు, ర్యాలీలకు అన్నింటికి అనుమతి తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర బ్యూరో, కొమరం భీం : దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఉట్నూర్ లోని వికాసం ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో కొమురం భీమ్ కాంప్లెక్స్ లో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, దివ్యాంగుల అవసరాల దృష్ట్యా వారికి కావలసిన సహాయ ఉపకరణాలు, దివ్యంగ పిల్లలకు కావలసిన సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కొరకు ఉపాధ్యాయులను నియమించి మంచి బోధన అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని . వికాసం ప్రత్యేక పాఠశాలను 10వ తరగతి వరకు ఆధునికరిస్తామని తెలిపారు .

తప్పుడు ప్రచారాలు చేయొద్దు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సంఘటన వాస్తవాలు ఒకటైతే మరోలా తప్పుడు ప్రచారాలు సోషల్ మీడియాలో చేయొద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోరారు. అడవి జంతువులను వేటాడడానికి తయారు చేసిన నాటు బాంబును కొరికి ఒక కుక్క మృతి చెందగా దీన్ని చిలవలు పలువలుగా ప్రచారం చేయడం తగదన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ పై ఉల్లిగడ్డ ఆకారంలోని నాటుబాంబును కొరికి ఒక కుక్క మృతి చెందినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని చెత్త పడేసే ప్రదేశం నుండి తినే పదార్థంలా భావించిన కుక్క కొరికడంతో బాంబు పేలి చనిపోయిందన్నారు. ఈ బాంబును అడవి జంతువుల వేట కోసం తయారు చేసి ఉంటారని ఎస్పీ తెలిపారు. నాటు బాంబులను చెత్తలో పడేసిన వ్యక్తుల గురించి పోలీసులు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఘటనలో మరేవిధమైన అనుమానస్పద కోణం ఏదీ లేదని ఎస్పీ నిర్ధారించారు. అందుకే సోషల్ మీడియాలో ఈ విషయంపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని కోరారు.

మహిళల రక్షణ, భద్రత కోస షీ టీమ్స్ నిఘా

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: మహిళలు, యువతుల రక్షణ కోసమే షీ టీం రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో ప్రజల మధ్య సాధారణ జనాల వలె మఫ్టీలో ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది బుధవారం అని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో కేసు, గుడచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు,మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్య వచ్చినప్పుడు 100కు డయల్ చేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700,పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386, మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి,వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని అన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన దివ్యంగ క్రీడల పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో ఆడారని కలెక్టర్ అన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించుకోవడం తో పాటు, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. సమాజంలోని అందరితోపాటు, దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని , ఇందుకుగాను విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య అభివృద్ధి వంటి రంగాలలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.దివ్యాంగుల సమస్య లను పరిష్కరించడానికి రెవిన్యూ డివిజన్లు, మండలాలలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని, ఈ ప్రత్యేక ప్రజావాణిలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం బ్యాటరీ మోటార్ వెహికల్స్, పింఛన్లను ప్రభుత్వం ఇస్తున్నదని, దివ్యాంగుల ఇతర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. దివ్యాంగులు బాగా చదువుకోవాలని, అన్ని రంగాలలో అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ పి. రమేష్,జిల్లా సంక్షేమ సంక్షేమ అధికారి కృష్ణవేణి,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి .డిఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిఇఓ బిక్షపతి పాల్గొన్నారు.

మొద్దులగూడెం సర్పంచ్‌గా రుక్మిణి ఏకగ్రీవం

విశాలాంధ్ర, దమ్మపేట : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దమ్మపేట మండలంలోని మొద్దులగూడెం పంచాయితీలో గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రధాన పార్టీలు చేతులు కలపడంతో మొద్దులగూడెంలో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థి ఆదివాసీ మహిళ బేతి రుక్మిణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా బిఆర్ ఎస్ పార్టీకి ఉప్ సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా అప్పగించేందుకు ఇరువు వర్గాలు అవగాహన కొచ్చినట్లు తెలిసింది. వార్డు సభ్యులు కూడా చెరిసగం పంచుకునేలా పరస్పర అవగాహనతో ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తుంది. రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధి ఏకైక ఎజెండాగా బద్ధ శత్రువులు గా వున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఏకం కావడంతో మండల వ్యాప్తంగా అభినందనలు వ్యక్తం అవుతున్నాయి. ఏకగ్రీవ పంచాయతీకి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలతో పాటు ప్రత్యేక నిధుల కూడా మంజూరు అవుతాయని అందుకే శత్రుత్వాలు వీడి కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకు న్నట్లు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దొడ్డ బాసర, బొగ్గం శివ అన్నారు. అభివృద్ధి విషయంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చారని తెలిపారు.

డివైడర్ ఢీ: ముగ్గురి యువకుల మృతి

విశాలాంధ్ర సత్తుపల్లి : బుధవారం తెల్లవారుజామున టీజీ 04ఏ4744 టాటా ఆల్ట్రోజ్ కారులో వియం.బంజర్ వైపు నుండి సతుపల్లి వెళ్తు కిష్టారం, అంబేద్కర్ కాలనీ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు సత్తుపల్లి కొంపల్లి కాలనీ చెందిన విద్యార్థులు సిద్దెసి జయ్ (18సం) మార్పకట్ల శశి, (11సం) చంద్రుగొండ మండలం, మహబూబ్ నగర్ చెందిన సాజిద్ (25 సం)అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తలారి అజయ్, ఇమ్రాన్ లకు తీవ్ర గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న స్థానిక సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి, పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను సత్తుపల్లి హాస్పిటల్ కు తరలించి బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించి విచారణ జరుపుతున్నట్టు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.

స్వేచ్ఛగా ఎన్నికల్లు నిర్వహించాలి

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో ఎన్నికలు జరిగేలా పోలీసులు సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది యొక్క ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కిసాన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్తు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. అప్పగించిన భాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు,మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందని గ్రహించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్, సరిహద్దు చెక్ పోస్టులు,రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన వుండాలన్నారు. అదేవిధంగా ఎన్నికల సభలు, సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకొవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐలు రాజు, మురళి, రూరల్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

హెూమ్ గార్డులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: హెూమ్ గార్డు రైసింగ్ డేను సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణం గ్రౌండ్‌లో హెూమ్ గార్డు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ప్రారంభించారు. హెూమ్ గార్డు సిబ్బంది జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించడంలో క్రీడలు విశేషంగా దోహదం చేస్తాయని తెలిపారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఆర్ఎస్ఐలు, హెూమ్ గార్డు సిబ్బంది పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగరూకత దివస్ లో భాగంగా మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో సైబర్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మెదక్ టౌన్ పోలీస్ సిబ్బంది, మెదక్ సైబర్ వారియర్స్ బృందం, గీతా జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.ర్యాలీ మెదక్ పోస్ట్ ఆఫీస్ నుండి ప్రారంభమై రాందాస్ చౌరస్తా వరకు సాగింది.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ అండ్ ఏరియా సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు రుద్రంపూర్ లోని ఆర్ సి ఓ ఏ క్లబ్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, విశిష్ట అతిథిగా వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జియం జి.వి. కిరణ్ కుమార్, లతోపాటు గౌరవ అతిథిగా ఏరియా సేవా ప్రెసిడెంట్ జి.మధుర వాణి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ మన సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ వ్యాప్తంగా దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే అన్నారు. వారి అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయాన్ని అందించాలని కోరారు. సేవా దృక్పథం తో పాల్వంచలో దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న శాంతి వెల్ఫేర్ స్కూల్ నిర్వహకులను, గౌతమి దివ్యాంగుల స్కూల్ బాధ్యులను అభినందించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఏఐటియూసి నాయకులు జే.గట్టయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఏజిఎం జివి మోహన్ రావు, డిజిఎం శివ కేశవ రావు, అధికారులు జి.హరీష్, కే.సునిల్ కుమార్, ఎం.మురళి, ఎస్.సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ లు క్రిసోలైట్, గౌతమి, 40 మంది దివ్యాంగులు, సేవా కొ-ఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

సంపాదకీయం

అజ్ఞాన జనిత అసత్య ప్రచారం

చదువు వచ్చిన వారికి చదువు రాని వారికీ తేడా స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఇక్కడ చదువు అంటే అక్షరాస్యత, డిగ్రీలు, స్నాతకోత్తర పట్టాలు అని కాదు. కానీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ తనకొచ్చిన చదువునంతా అటకెక్కించేసి వాట్సాప్ యూనివర్సిటీ డిగ్రీకోసం తాపత్రయ పడు తున్నట్టున్నారు. చదువు లేకపోవడం ఎవరి తప్పూ కాకపోవచ్చు. రాజకీయ నాయకులకు విద్యార్హత ఉండవలసిన అవసరం లేదు. కానీ జ్ఞానం, లోకజ్ఞానం – రెండూ ఉంటేనే గానీ ఎవరూ రాజకీయాలలో రాణించలేరు. రాజ్‌నాథ్‌సింగ్ విద్యార్హతపై ఎలాంటి అనుమానాలూ లేవు. ఆయన భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) లో ఎమ్మెస్సీ పట్టా సాధించారు. కొంత కాలం అధ్యాపకుడిగా కూడా పని చేశారు. 74 ఏళ్లు దాటిన రాజ్‌నాథ్‌సింగ్ రాజకీయ అనుభవం కూడా సుదీర్ఘమైందే. 13 ఏళ్ల వయసు నుంచి ఆయనకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉంది. ఆయన ఉత్తరప్రదేశ్ మంత్రి వర్గంలో విద్యాశాఖను కూడా నిర్వహించారు. ఆ తరవాత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అయ్యారు. ఆయన హయాంలోనే ఉత్తరప్రదేశ్‌లో వేదిక్ గణితాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. పరీక్షల్లో కాపీ కొట్టడాన్ని నిరోధించడానికి చట్టం కూడా తీసుకొచ్చారు. రాజ్‌నాథ్‌సింగ్ విద్యాధికుడే కాక పరిణత రాజకీయ నాయకుడు అనుకుంటాం. అలాంటి పెద్ద మనిషి రాజకీయ స్వప్రయోజనాల కోసం ఏ రకంగానూ సమర్థనీయం కాని అబద్ధాలు మాట్లాడుతున్నారు. మంగళవారం ఆయన మెడకాయ మీద తలకాయ ఉన్న వారందరూ నిర్ఘాంత పోయే అబద్ధం చెప్పారు. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ నిధులతో బాబ్రీ మసీదు నిర్మించాలనుకున్నారని జంకూ గొంకూ లేకుండా పెద్ద అబద్ధం ఆడేశారు. నెహ్రూ మీద రాజ్‌నాథ్‌సింగ్ తెలిసి తెలిసి అబద్ధం ప్రచారంలో పెడ్తున్నారని గ్రహించడానికి పెద్ద పరిశోధన అక్కర్లేదు. ఎందుకంటే నెహ్రూ బతికున్నన్నాళ్లూ ఆ తరవాత 28 ఏళ్లు బాబ్రీ మసీదు పదిలంగానే ఉంది. అలాంటప్పుడు నెహ్రూ బాబ్రీ మసీదును నిర్మించడం ఏమిటి? దాని నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వెచ్చించాలనుకోవడం ఏమిటో? ప్రభుత్వ ధనంతో నెహ్రూ బాబ్రీ మసీదు నిర్మించాలనుకుంటే దాన్ని వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి సర్దార్‌పటేల్ అని చెప్పడానికి రాజ్‌నాథ్‌సింగ్ ఏమాత్రం సిగ్గు పడలేదు. బాబ్రీ మసీదు పునర్నిర్మాణ చర్చ 1992 డిసెంబర్ 6 న సంఘ్ పరివార్ కరసేవకులు నేల మట్టం చేసిన తరవాత కదా చర్చలోకి వచ్చింది. బాబ్రీ మసీదుకు సంబంధించి నెహ్రూ ప్రమేయం ఒకే ఒక్కసారి కనిపిస్తుంది. అది 1949 లో ఓ అర్ధరాత్రి వేళ దొంగచాటుగా బాబ్రీ మసీదులో రాముడి విగ్రహాలు చేర్చడం. దీన్ని నెహ్రూ అంగీకరించలేదు. ఆ విగ్రహాలను తొలగించాలని అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గోవింద వల్లభ్ పంత్‌ను నెహ్రూ కోరారు. కానీ ఆ ప్రాంత జిల్లా కలెక్టర్ కె.కె.నాయర్ వెనుకాడారు. పటేల్ కూడా ఆ విగ్రహాలను తొలగించాలనే అన్నారు. నెహ్రూ అనుకున్నట్టు విగ్రహాలను బాబ్రీ ఆవరణ నుంచి తొలగించడం కుదరనే లేదు. విగ్రహాలు తొలగిస్తే అగ్గి అంటుకుంటుంది అని గోవింద్ వల్లభ్ పంత్, ఆ ప్రాంత జిల్లా కలెక్టర్ కె.కె.నాయర్ భయపెట్టారు. బాబ్రీ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వినియోగించాలని నెహ్రూ అనుకున్నట్టు, అప్పటి హోం మంత్రి సర్దార్‌పటేల్ దాన్ని వ్యతిరేకించినట్టు రాజ్‌నాథ్‌సింగ్ అల్లింది కేవలం కట్టుకథే. నెహ్రూకు, సర్దార్‌పటేల్‌కు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అధికారిక దస్తావేజులు అన్నీ ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. ఈ ఇద్దరు నాయకుల సంకలిత రచనలు డజన్ల సంఖ్యలో ఉన్నాయి. నెహ్రూ రచనల, ఉపన్యాసాల, ఉత్తర ప్రత్యుత్తరాల సంపుటాలన్నీ కలిపితే వంద దాకా ఉంటాయి. ఇవన్నీ అందుబాటులోనే ఉన్నాయి.

రాజ్‌నాథ్ సింగ్ చదివింది భౌతిక శాస్త్రమైనా చరిత్ర గురించి మాట్లాడేటప్పుడు చరిత్రలో కొన్ని పేజీలైనా తిరగేయాలన్న ఆలోచన రాజ్‌నాథ్ సింగ్‌కు రానే లేదు. సైన్స్ చదువుకున్న వారందరికీ శాస్త్రీయ జ్ఞానం ఉంటుందనుకోలేం. రాజ్‌నాథ్‌సింగ్ దీనికి మినహాయింపు కాదు. ప్రభుత్వ రికార్డుల్లోగాన్ని నెహ్రూ-పటేల్ సంకలిత రచనల్లో గానీ రాజ్‌నాథ్‌సింగ్ చేసిన ఆరోపణ ఎక్కడా కనిపించదు. ఏ చరిత్రకారుడూ ఇలాంటి ప్రస్తావన ఎన్నడూ తీసుకురాలేదు. ఇప్పుడు అందుబాటులో ఉన్న గ్రోక్‌లాంటి కంప్యూటర్‌పరిజ్ఞానాన్ని ఉపయోగించినా రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాల ఊసు ఎక్కడా కనిపించదు. అయితే ఉన్నత స్థానాల్లో ఉన్న రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారు చెప్పేది అబద్ధమైనా ఆ ప్రభావం కచ్చితంగా లోతుగా పరిశీలించే అలవాటు లేని జనం మీద ఉంటుంది. పైగా వాట్సప్ యూనివర్సిటీ రాజ్యమేలుతున్న దశలో అసత్యం ఆఘమేఘాల మీద వ్యాపిస్తుంది. రాజ్‌నాథ్ ఇలా మాట్లాడడం హాస్యాస్పదమే కాదు దౌర్భాగ్యం. నెహ్రూ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనా విధానం ఏమిటో గ్రహించడానికి మరో ఉదంతం గురించి తెలుసుకోవాలి. సోంనాథ్ దేవాలయం జీర్ణోద్ధారణ జరిగింది. దీనికి ప్రభుత్వ ధనం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పిన మాట అక్షర సత్యం. సోంనాథ్ ఆలయ జీర్ణోద్ధరణకు ప్రభుత్వ ధనం వాడకూడదని మత విశ్వాసాలు ఉన్న మహాత్మాగాంధీ కూడా అనేవారు. నెహ్రూది అదే అభిప్రాయం. కానీ ఆలయ పునరుద్ధరణ తరవాత అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించారు. ఇలాంటి కార్యక్రమాలకు రాష్ట్రపతిస్థానంలో ఉన్నవారు వెళ్లకూడదని నెహ్రూ అభిప్రాయపడ్డారు. అప్పటి రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి ఈ విషయంలో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు అందుబాటులో ఉన్నాయి. తమ జ్ఞానాన్ని అజ్ఞానం ప్రచారం చేయడానికి ప్రయత్నించిన "మహామహుల"కు కొదవేలేదు. హనుమాన్‌ప్రసాద్ పోద్దార్ గీతా ప్రెస్ ట్రస్టీలలో ఒకరు. ఆయన "కళ్యాణ్" పత్రిక నిర్వహించే వారు. అందులో గాంధీ కూడా రెండో మూడో వ్యాసాలు రాశారు. ప్రేంచంద్ కూడా రాశారు. అంతమాత్రంచేత గాంధీ, ప్రేంచంద్ మతతత్వవాదులు అయిపోరు. నెహ్రూనుకూడా తమ "కళ్యాణ్" పత్రికలో రాయాలని పోద్దార్ రెండుసార్లు అడిగారు. కానీ సైద్ధాంతిక సామ్యం లేని చోట తానురాసే ప్రసక్తేలేదని నెహ్రూ తెగేసిచెప్పారు. సెక్యులరిజం, సోషలిజం, అంతర్జాతీయవాదం గురించి నెహ్రూకు కచ్చితమైన, నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండేవి. వాటితో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. నెహ్రూకు-సర్దార్ పటేల్‌కు, నెహ్రూకు-సుభాష్‌చంద్రబోస్‌కు, నెహ్రూకు నేతాజీకి విభేదాలున్నాయని సంఘ్ పరివార్ నిరంతరం ప్రచారం చేస్తూ ఉంటుంది. వారి మధ్య ఉన్నవి భిన్నాభిప్రాయాలే గానీ విభేదాలు కావు. చరిత్ర గురించి కనీస అవగాహన లేని రాజ్‌నాథ్ లాంటి వారు అబద్ధాలు తప్ప ఏం చెప్పగలరు గనక!

పుష్కలంగా ఉన్నా... దిగుమతులా?

ఆంధ్రప్రదేశ్‌లో నేడు మొక్కజొన్న రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాడు. సేద్యపు ఖర్చులు పెరగడం, పండించిన పంటకు న్యాయమైన ధర లభించక, మద్దతు ధర అలంకార ప్రాయంగా మారడం, దళారుల దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ప్రపంచంలో మొక్కజొన్నను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలు అమెరికా, మెక్సికో, బ్రెజిల్, చైనా. అమెరికా 9 కోట్ల, 60 లక్షల ఎకరాల సాగు ద్వారా 360 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేస్తూ మొదటి స్థానంలో ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో మొక్కజొన్న ఉత్పత్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది.

ప్రపంచ ఎగుమతుల్లో అమెరికా వాటానే 50% గా ఉంది. అమెరికా పాలకులు 1930 నుంచి మొక్కజొన్న ఉత్పత్తికి మద్దతు ఇస్తున్నారు. గత 20 సంవత్సరాల్లో సబ్సిడీ సగటు వార్షిక వ్యయం 47 లక్షల డాలర్లు. ప్రతి సంవత్సరం అమెరికా రైతు 61 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు. భారత రైతులకు కేవలం 282 డాలర్లు మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. అమెరికాలో మొక్కజొన్న దిగుబడి హెక్టార్‌కు 11 టన్నులు కాగా, భారత్‌లో 2 టన్నుల 540 కిలోలు మాత్రమే. నేడు భారతదేశంలో 9.89 మిలియన్ల హెక్టార్ల మొక్కజొన్న సాగు ద్వారా ప్రపంచ విస్తీర్ణంలో 4 వ స్థానంలో ఉంది. ఉత్పత్తి 42.3 మిలియన్ టన్నులు. సగటు దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు. దిగుబడుల్లో చాలా వెనుకబడి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంవత్సరం 1.42 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. దేశంలో మొక్కజొన్న సాగులో తెలంగాణ 5 వ, ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉన్నాయి. ఏపీ ఎకరా సేద్యపు ఖర్చు 30 నుంచి 35 వేలు. కౌలు రైతులు అదనంగా మరో 13 వేలు కౌలు చెల్లించాలి. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. కొందరి రైతులకు 35 క్వింటాళ్ల దాకా వస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర 2,400 రూపాయలు. ఈ ధర రైతులకు అంత ప్రయోజనంగా లేదు. ఏపీ రైతులకు మద్దతు ధర లభించక నష్ట పోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు లేక పోవడం వల్ల ప్రైవేట్ మార్కెట్లో లభిస్తున్న ధర 1600 రూపాయలు మాత్రమే. కొన్ని ప్రాంతాల్లో 1450 మాత్రమే ధర దక్కుతున్నది. ఫలితంగా రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్ట పోతున్నాడు.

రైతాంగం గిట్టుబాటు ధర లభించక నష్టపోయి అప్పుల పాలౌతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దేశ రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయకుండా 5 లక్షల టన్నుల మొక్కజొన్నను మోదీ ప్రభుత్వం అమెరికా నుంచి దిగుమతి చేసుకుని భారత రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది. అమెరికా మొక్కజొన్నను భారత్ దిగుమతి చేసుకోవాలని మోదీని ట్రంప్ బెదిరించడం, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన చర్చల్లో మా మొక్కజొన్న కొనరా అని అమెరికా వాణిజ్య మంత్రి హౌ వార్డ్ లుట్నిక్ భారత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అందుకు తలొగ్గిన మోదీ ప్రభుత్వం మొక్కజొన్న దిగుమతిపై 11%గా ఉన్న సుంకాన్ని కూడా తొలగించి దిగుమతి ఒప్పందం చేసుకోవడం భారత ప్రభుత్వంపై అమెరికా ఆధిపత్యానికి నిదర్శనం.

కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పంటల కొనుగోళ్ల బాధ్యత ఉంది. గిట్టుబాటు ధర పంటలకు లభించనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా పంటలు కొనుగోళ్లు చేయాలి. నేడు పత్తి రైతులను ఆ విధంగా ఆదుకోవాలి. అలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి 3 వేల కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 300 ,కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తంతో పంటల కొనుగోళ్లు ఎలా సాధ్యం. కూటమి ప్రభుత్వం మొక్కజొన్న రైతులనే కాదు, ఏ పంట రైతులను ఆదుకోవటం లేదు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ, మద్దతు ధర చెల్లించి ప్రభుత్వ సంస్థలే రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయాలని, దళారుల, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, మొక్కజొన్న దిగుమతులను ఆపాలని ఉద్యమించడమే రైతుల తక్షణ కర్తవ్యం.

బొల్లిముంత సాంబశివరావు

సెల్:9885983526

విత్తన ముసాయిదా బిల్లు కార్పొరేట్ల లాభాలకే



కేవీవీ ప్రసాద్

కేంద్ర ప్రభుత్వం 2025 నవంబరు 11 న "విత్తన చట్టం -2025" ముసాయిదా బిల్లు తెచ్చింది. దీనిపై డిసెంబరు 11 వరకు సూచనలు, సలహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిందిగా ప్రజల మధ్య ఉంచింది. 1966 విత్తనచట్టం, విత్తన కంట్రోలు చట్టం 1983 సవరణ చట్టం బదులుగా 2025 విత్తనాల ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజా సమూహంలో చర్చకు పెట్టింది. బిల్లుపై రైతుసంఘాలు, శాస్త్రవేత్తల సూచనలు పంపిస్తున్నారు. అయితే కేంద్రం బిల్లు రూపొందించే ముందుగానే రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగంలో అనుభవం గడించిన నిపుణులతో చర్చకు ఆహ్వానించి ఉండాల్సింది. డిసెంబరు 11 లోగా అంటే కేవలం నెలరోజులు గడువుపెట్టి బిల్లుపై సూచనలు తెలియచేయమనడం ఏమాత్రం సమర్థనీయం కాదు.

దేశ వ్యాపితంగా సుమారు 10 కోట్ల మంది రైతులు, కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వీరందరూ వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రాలలో సైతం గతంలో రూపొందించిన విత్తన చట్టాలు ఉన్నాయి. అనేక భాషల్లో మాట్లాడే రైతులు ఉన్నారు. కేంద్ర చట్టం ఇంగ్లీషు లేదా హిందీ భాషల్లో మాత్రమే ఉంటుంది. మరో పక్క అనేకమంది రైతులు నిరక్షరాస్యులు ఉన్నారు. వీరందరూ బిల్లుపై చర్చించి తమ అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న రైతాంగం, ప్రజలు బిల్లుపై సంపూర్ణంగా చర్చించి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు వెల్లడించడానికి కనీసం ఆరు నెలల సమయం అవసరం. అదే విధంగా ముసాయిదా బిల్లు ప్రతులు అన్ని భాషల్లో తర్జుమా చేసి అందించాలి. బిల్లుపై విస్తృత చర్చ జరిగే వీలు కల్పించాలి. తద్వారా సమగ్ర విత్తన చట్టం రూపొందించాలి. అదేవిధంగా రాష్ట్రాల పరిధిలో ఉండాల్సిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ విత్తన కంపెనీల లాభాల కోసం కేంద్రం తమ చేతుల్లోకి తీసుకొని రాష్ట్రాల ప్రమేయం లేకుండా చట్టాలు రూపొందిస్తున్నది. చట్టం రూపకల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలపై కూడా చర్చ జరగాల్సి ఉంది.

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పరిధిలోని

రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని, చట్టానికి నిబంధనలు రూపొందించి అమలు చేయాలి. విత్తనాలపై ధరల నియంత్రణ కూడా రాష్ట్రాలదే. రాష్ట్రాల్లో యూనివర్సిటీలు, నూతన పరిశోధన కేంద్రాలు, కొత్త విత్తనాలు కనిపెట్టి పరిశీలించి ఫీల్డ్ ట్రయల్స్ జరిపి ఐసీఏఆర్ ఆమోదం పొందిన తర్వాత వాణిజ్యపరంగా రైతులకు అందించాల్సి ఉంది. కంపెనీలు తమ బ్రాండ్‌తో పాటు జర్మినేషన్ రేట్, ఎమ్యార్పీరేటు, ఎక్స్పైరీ డేట్ తదితర వివరాలు ప్రకటించాలి. వారిచ్చిన వివరాలకు భిన్నంగా పంట వేసిన రైతులకు నష్టం జరిగితే కంపెనీ భరించాల్సి ఉంటుంది. రాజ్యాంగం రీత్యాపై అంశాలను అమలు జరపాలి. రాష్ట్రాల పరిధిలో విత్తన కమిటీలు అవసరమైన రీతిలో సబ్ కమిటీలు, శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులైన రైతులతో ఏర్పాటు చేయాలి. సమగ్ర విత్తన చట్టం రూపొందించాలి. దేశంలో ఉత్పాదకతను, ఉత్పత్తిని పెంచడానికి వీలుగాను ఇతర దేశాల నుంచి అధికోత్పత్తి వంగడాలను, హైబ్రిడ్ వెరైటీలను దిగుమతి చేసుకోవడానికి వీలుగా విత్తన చట్టం – 1966 చేశారు. 1983లో విత్తన కంట్రోల్ చట్టానికి సవరణ చట్టం వచ్చింది. అనంతరం విత్తన ఉత్పత్తి చేసే రైతులకు కంపెనీల నుంచి రక్షణ కల్పించడానికి విత్తన ఉత్పత్తి చేసే రాష్ట్రాల పరిధిలో విత్తన చట్టాలు తేవాల్సిన అవశ్యకత ఏర్పడింది. విత్తన వ్యవస్థలోకి టాటా, బిర్లా, ఐటీసీ., రిలయన్స్ లాంటి ప్రముఖ కంపెనీలు వచ్చాయి. మరోపక్క మాన్సంటో, డు-ఫాండ్, కార్గిల్, సిన్‌జెంటలాంటి విదేశీ గుత్త కార్పొరేట్ కంపెనీలు అధిపత్యం సాధించాయి. ఈ స్థితిలో రైతుల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం తెచ్చేందుకు ప్రయత్నించి, 2004లో పార్లమెంటులో ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేదు. అదే చట్టానికి 2010లో కొన్ని సవరణలు ప్రతిపాదించినా కూడా పార్లమెంటు ఆమోదం లభించలేదు. 2019లో కేంద్రం మరో ముసాయిదా చట్టాన్ని తెచ్చే ప్రయత్నం చేసినా కార్పొరేట్ విత్తన కంపెనీల ఒత్తిడితో పెండింగ్‌లో పెట్టారు.

రాష్ట్రాల పరిధిలో విత్తన చట్టాలు తెచ్చే ప్రయత్నాలు జరిగినా కేంద్రం ఒత్తిడితో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. కేంద్రం, రాష్ట్రాల వ్యవసాయ శాఖలు కార్పొరేట్ విత్తన సంస్థల కనుసన్నల్లో పనిచేస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. రైతుల ప్రయోజనాలు కాపాడే బలీయమైన విత్తన చట్టాలు లేనందున ప్రతి సంవత్సరం రైతాంగం ఉత్పత్తిని కోల్పోవడమేకాకుండా లక్షలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోపక్క స్వదేశీ, విదేశీ విత్తన సంస్థల లాభాలు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి.

2020 నవంబరు 26 నుంచి దిల్లీ సరిహద్దులతో పాటు దేశ వ్యాపితంగా మహోధృతంగా జరిగిన 13 మాసాల రైతాంగ ఉద్యమ విరమణ సందర్భంగా విత్తన చట్టం తెచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రస్తుతం ప్రతిపాదించిన 2025 విత్తన చట్ట ముసాయిదా రైతు సంఘాలతో, వ్యవసాయరంగ నిపుణులతో చర్చించకుండా ఏకపక్షంగా ప్రకటించింది. నెలరోజుల నామమాత్రపు గడువు పెట్టి సూచనలు, అభ్యంతరాలు కోరింది. విదేశీ విత్తన దిగుమతులపై ఆంక్షల తొలగింపు, నియంత్రణ రద్దు, జన్యు మార్పిడి పంటల ప్రోత్సాహనికి ముసాయిదా అధిక ప్రాధాన్యతనిచ్చింది. ముసాయిదాలోని అనేక అంశాలు రైతాంగ ప్రయోజనాలకు నష్టదాయకంగానూ, విత్తన కంపెనీలకు దోహదపడేలా ఉన్నాయి. ధనిక దేశాల నుంచి విత్తనాలు దిగుమతి చేసుకొని మన రైతాంగాన్ని మన దేశ విత్తన వ్యవస్థను దెబ్బతీసేలా ముసాయిదా రూపొందించారు.

గతంలో మాన్సెంటు లాంటి విదేశీ విత్తన సంస్థలు బీటీ విత్తనాలను రంగంలోకి తెచ్చాయి. 450 గ్రాముల విత్తనాలను రూ॥1,850కు అమ్మి పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించాయి. ఆ సమయంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులుగా ఉన్న కొల్లి నాగేశ్వరావు రైతుసంఘం ఆధ్వర్యాన రైతాంగ పక్షాన న్యాయపరంగాను, ఐక్య ఆందోళన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి బీటీ 1 రకం రూ॥ 650లకు, బీటీ వెరైటీ రూ॥ 750కు తగ్గించడంలో కృతకృత్యులయ్యారు.

ప్రస్తుతం కేంద్రం రూపొందించిన ముసాయిదాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధ్యయనం చేసి రాష్ట్ర హక్కులను కాపాడే విధంగాను, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించేలా అవసరమైన సవరణలు రూపొందించి కేంద్రానికి పంపాలి. విత్తన కంపెనీలు, డీలర్ల, మధ్యదళారులు, విత్తన ప్రమోటర్ల మోసాలకు రైతులు నష్టపోకుండా వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా సమగ్ర చట్టం తెచ్చేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాల్సి వుంది.

ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

భారీగా పెరిగిన ఆర్థిక బాధ్యతలు, అప్పులు

ఆర్. సూర్యమూర్తి

భారతదేశ ఆర్థిక పథంపై శ్రద్ధ చూపే ఎవరినైనా కలవరపెట్టే అనేక విషయాలు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడయ్యాయి. గృహ ఆర్థిక బాధ్యతలు - భారతీయ కుటుంబాలు బ్యాంకులు, ఎన్ఎఫ్‌బీసీలు ఇతర రుణదాతలకు చెల్లించాల్సిన అప్పులు - కేవలం నాలుగు సంవత్సరాలలో 76% పెరిగాయి, మార్చి 2021 లో ఉన్న రు.77.7 లక్షల కోట్ల నుంచి మార్చి 2025 నాటికి రు.136.6 లక్షల కోట్లకు ఈ రుణాలు పెరిగాయి. దేశం పొదుపు కాదు, రుణాలు తీసుకోవడం, భారత వృద్ధి కథను మరింతగా ప్రభావితం చేసే దశలోకి ప్రవేశించిందని దిగ్భ్రాంతికర వాస్తవాన్ని ఇక్కడ మరవకూడదు. రాజకీయంగా విస్మరించడానికి అనుకూలమైనప్పటికీ, ఆ ప్రాథమిక అసమతుల్యత ఒక తీవ్రమైన స్థూల ఆర్థిక ప్రమాదం. డిసెంబర్ 1 న లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో భారతదేశ గృహ బ్యాలెన్స్ షీట్ అరుదైన, భయంకరమైన వాస్తవాలను అందిస్తోంది. ఈ చిత్రం నిరపాయకరమైనది లేదా తాత్కాలికమైనది కాదు. అప్పుల పెరుగుదల విడిగా జరగడం లేదు. ఆర్థిక వ్యవస్థ సంప్రదాయ దిగ్భ్రాంతి కలిగించే పరిశీలన నికర గృహ ఆర్థిక పొదుపులు, కరోనా మహమ్మారి సమయంలో బలవంతపు పొదుపు సంవత్సరం (2020-21) జీడీపీలో 11.7% నుంచి 2022-23 లో కేవలం 5.0% కి పడిపోయి, 2023-24 లో 5.2% కి, 2024-25 లో 6.0% కి తిరిగి చేరుకున్న సందర్భంలో ఇది జరుగుతోంది. స్వల్పంగా కోలుకున్న తర్వాత కూడా, భారతదేశ గృహ పొదుపు రేటు కరోనా మహమ్మారికి ముందు సగటు అయిన 7%- 8% కంటే నాటకీయంగా తక్కువగా ఉంది. ఇందుకు విధాన రూపకర్తలు వారు అంగీకరించిన దానికంటే ఎక్కువగా ఆందోళన చెందాలి.

ఇదిలావుండగా, బాధ్యతలు మాత్రం చాలా వేగంగా పెరిగాయి. ఆర్బీఐ డేటా ప్రకారం ఆర్థిక బాధ్యతలు 2023 ఆర్థిక సంవత్సరంలో 18.5%, 2024 ఆర్థిక సంవత్సరంలో 18.4% పెరిగాయి. కొన్ని సంవత్సరాలలో ఆర్థిక ఆస్తుల వృద్ధి రేటు కంటే ఇది దాదాపు రెట్టింపుగా ఉన్నది. 2021-2025 మధ్య ఆస్తుల నిల్వ 228.7 లక్షల కోట్ల రూపాయల నుంచి 352.6 లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయి. కానీ బాధ్యతలు అత్యంత వేగంగా ముందుకు సాగాయి, ఆర్థిక మాంద్యం సమయంలో కుటుంబాలు ఆధారపడే భద్రతా మార్జిన్‌ను తగ్గించాయి. ఇది ఒక నాటకీయ క్షణంలో ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయని ఒక రకమైన అసమతుల్యత; ఇది నిశ్శబ్దంగా స్థితిస్థాపకతను క్షీణింపజేస్తుంది. ఇక్కడ అత్యంత ఆశ్చర్యకర విషయమేమంటే... భారతదేశం అప్పులు చేయడమేకాదు, భారతీయులలో అత్యధికులు అప్పుల కోసం ఎగబడుతున్నారు. మార్చి 2018 లో, అధికారిక ఆర్థిక

వ్యవస్థలో "ప్రత్యక్ష ప్రత్యేక రుణగ్రహీతల" సంఖ్య 12.8 కోట్లుగా ఉంది. మార్చి 2025 నాటికి, ఆ సంఖ్య 28.3 కోట్లకు పెరిగింది. ఏడు సంవత్సరాలలో ప్రతి రుణగ్రహీత సగటు రుణం రు.3.41 లక్షల నుంచి దాదాపు రు.4.78 లక్షలకు పెరిగింది. ఇది 40% కంటే ఎక్కువ. ఇవి చిన్నవి కావు, చక్రీయ హెచ్చుతగ్గులు. వినియోగం, ఆస్తి నిర్మాణం, సాధారణ ఖర్చులకు కూడా క్రెడిట్ మద్దతు ఎక్కువగా అవసరమయ్యే సమాజానికి ఇవి నిర్మాణాత్మక సూచికలు. కానీ ఆస్తి ఆధారిత రుణాలు కూడా పెరుగుతున్న ఈఎంఐలు, అదుపులోనికి రాని ద్రవ్యోల్బణం, అసమాన ఆదాయ వృద్ధి, మధ్యతరగతికి స్థిరమైన వేతన పెంపుదల కోసం ఇప్పటికీ కష్టపడుతున్న కార్మిక మార్కెట్ కొనసాగుతున్నప్పుడు నష్టాలు తప్పనిసరి. ఆదాయాలు వేగంతో కొనసాగకపోతే, "ఆస్తి ఆధారిత" త్వరగా "ఒత్తిడి ఆధారిత"గా మారవచ్చు. మరింత ఇబ్బంది కలిగించే విషయం ఏమిటంటే డేటా దీర్ఘ చాపం. 2014-15, 2019-20 మధ్య గృహ బాధ్యతలు జీడీపీలో 4% కంటే తక్కువగా స్థిరంగా ఉన్నాయి. అప్పుడు కరోనా మహమ్మారి దెబ్బ, పొదుపులు తాత్కాలికంగా పెరిగాయి. ఆ తరువాత - అప్పులు మాత్రమే పెరిగాయి.

2022-23 నాటికి గృహ బాధ్యతలు జీడీపీలో 5.9 శాతానికి చేరుకున్నాయి. కరోనా అనంతర కాలం అంటే 2023-24 నాటికి అవి మరింత పెరిగి 6.2 శాతానికి చేరుకున్నాయి. ఒక దశాబ్ది కాలంలోనే ఇది అత్యధికం. 2025 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే మనం జీడీపీలో 4.7% కి తగ్గుదల చూస్తాం. ప్రభుత్వం దీనిని "ముందస్తు డెలివరేజింగ్" కి సంకేతంగా ప్రదర్శిస్తోంది. అది నిజమే కావచ్చు. లేదా అధిక వడ్డీ రేట్ల కారణంగా రుణాలు తీసుకోవడంలో కుటుంబాలు ఆలస్యం చేయటాన్ని ప్రతిబింబిస్తుంది, వారి ఆర్థిక పరిస్థితి అర్థవంతంగా మెరుగుపడినందున ఏమాత్రం కాదు. ప్రాథమికంగా మరో మార్పు జరుగుతోంది: కుటుంబాలు సంప్రదాయ బ్యాంకు డిపాజిట్లను వదిలివేసి మ్యూచువల్ ఫండ్ల వైపు మొగ్గు చూపుతున్నాయి. 2020-21 లో రు.0.6 లక్షల కోట్ల నుంచి 2024-25 లో రు, 4.7 లక్షల కోట్లకు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు పెరిగాయి - ఇది సంపూర్ణ ప్రవాహాలలో దాదాపు ఎనిమిది రెట్లు పెరుగుదల. స్థూల ఆర్థిక పొదుపులో వాటాగా, మ్యూచువల్ ఫండ్లు కేవలం నాలుగు సంవత్సరాలలో 2.1% నుంచి 13.1% కి పెరిగాయి. దీనికి విరుద్ధంగా, స్థూల ఆర్థిక పొదుపులు అదే కాలంలో రు.30.7 లక్షల కోట్ల నుంచి కేవలం రు.35.6 లక్షల కోట్లకు పెరిగాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ కాగితంపై విస్తరిస్తున్నప్పటికీ, వినియోగం, పొదుపు, దీర్ఘకాలిక స్థిరత్వానికి మూలమైన దాని కుటుంబాల ఆర్థిక పునాది బలహీనపడుతోంది. ఏ దేశమూ అప్పుగా తీసుకున్న ఆశావాదంపై స్థిరంగా వృద్ధి చెందలేదు. భారతదేశం ఇప్పుడు తన గృహ రుణ సమస్యను ఎదుర్కోకపోతే, రేపు అది అద్భుతంగా కూలి పోదు. కానీ అది భారతదేశ చరిత్రను నిర్వచించాల్సిన ఆకాంక్షలు కలిగిన ప్రజల ఆర్థిక భద్రతను ఏడాదికి ఏడాది దెబ్బతీస్తుంది. హెచ్చరిక సంకేతాలు ఇప్పటికే డేటాలో ఉన్నాయి. ప్రశ్న ఏమిటంటే విధాన నిర్ణేతలు వాటిని చదవాలనుకుంటున్నారా - లేదా రుణ చక్రం పరిణామాలను విస్మరించడం అసాధ్యం చేసే వరకు వేచి ఉండాలనుకుంటున్నారా అనేదే.

మోదీపై కాంగ్రెస్ ఏఐ వీడియో

బీజేపీ మండిపాటు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ కాంగ్రెస్ నాయకురాలు పోస్ట్ చేసిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కించపరిచేలా ఆ వీడియో ఉండటంపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాగిణి నాయక్ తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ప్రధాని చాయ్ అమ్ముతున్నట్లుగా ఉన్న ఏఐ జనరేటెడ్ వీడియో అది. ఇది వివాదాస్పదమైంది. ఈ వీడియోపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రధాని మూలాలను వారు అవమానిస్తున్నారంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. 'ఓ కాంగ్రెస్ ఎంపీ పార్లమెంట్‌కు శునకాన్ని తీసుకొచ్చి అవమానించారు. ఇప్పుడు రాగిణి నాయక్ ప్రధాని చాయ్‌వాలా బ్యాక్‌గ్రౌండ్‌ను హేళన చేస్తున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీ ఎదుగుదలను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబం పేరు చెప్పి బతికే కాంగ్రెస్... పనిచేసే ప్రధానికి మద్దతుగా నిలబడలేకపోతోంది' అని షెహజాద్ ఎద్దేవా చేశారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రధానిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిందని ఆయన గుర్తుచేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని తల్లిని అవమానించారని, అలాంటి పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని విమర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు బిగుస్తోన్న ఉచ్చు

తిరువనంతపురం: కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌కు ఉచ్చుబిగుస్తోంది. ఆయనపై అత్యాచారం ఫిర్యాదులు పెరుగుతున్నాయి. రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అనంతరం గర్భాన్ని తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన ఓ యువతి ఫిర్యాదు చేయడంతో ఇటీవల అతడిపై రేప్ కేసు నమోదైంది. పరారీలో ఉన్న అతడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. తాజాగా మరో యువతి కూడా రాహుల్ తనను లైంగికంగా వేధించినట్లు ఫిర్యాదు చేసింది. రాహుల్ తనను లైంగికంగా వేధించినట్లు కేరళకు చెందిన 23 ఏళ్ల యువతి కేరళ కాంగ్రెస్ కమిటీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. యువతి తన ఫిర్యాదులో రాహుల్ మామ్‌కుటత్తిల్ తనను వివాహం చేసుకుంటానని నమ్మించి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపించింది. రాజకీయంగా అతడికి పలుకుబడి ఉండడంతో ఇన్ని రోజులు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయానని, అతడిపై తేత్యాచారం కేసు నమోదవడంతో తాను కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. యువతి కాంగ్రెస్ పార్టీకి చేసిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయాలని పోలీసులకు సూచించామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ తెలిపారు. ఆమె పంపిన మెయిల్‌ను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అతడి ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

సంచార్ సాథీతో స్నూపింగ్ సాధ్యం కాదు: సింధియా

న్యూఢిల్లీ: సంచార్ సాథీ యాప్‌పై కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరోసారి స్పందించారు. ఈ యాప్ ద్వారా స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని బుధవారం లోక్‌సభలో వెల్లడించారు. ఇది ప్రజల రక్షణ కోసమేనన్నారు. యాప్‌లో రిజిస్టర్ కాకుండా అది పనిచేయదని వివరించారు. ఫోన్‌లో సంచార్‌సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాల్ అయి ఉండాలి. ఫోన్ వాడకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఈ యాప్ పని చేయాలి. ఫోన్ నుంచి ఈ యాప్‌ను తొలగించే వీలుండకూడదని కేంద్రం చెబుతోంది. దానిపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్రం వెనక్కి తగ్గింది. 'మీరు ఆ యాప్‌ను కొనసాగించాలని అనుకుంటే... మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా. ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే... అది అచేతనంగా ఉండిపోతుంది' అని సింధియా వివరణ ఇచ్చారు.

ఐఐటీ కాన్పూర్ సరికొత్త రికార్డు

కాన్పూర్: ఐఐటీ కాన్పూర్‌లో ప్లేస్‌మెంట్ల సందడి మొదలైంది. ప్లేస్‌మెంట్‌ల సీజన్ ప్రారంభమైన తొలిరోజే ఈ క్యాంపస్ సరికొత్త రికార్డు నమోదు చేసింది. 2025-26 సంవత్సరానికిగాను మొదటిరోజే ఈ క్యాంపస్ నుంచి ఏకంగా 672 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగ ఆఫర్లు సాధించారు. గతేడాది తొలి రోజుతో పోలిస్తే ఇది 16 శాతం అధికమని, తమ విద్యార్థుల ప్రతిభకు పెరుగుతున్న డిమాండ్‌కు ఇదే నిదర్శనమని ఐఐటీ కాన్పూర్ 'ఎక్స్' పేర్కొంది. తొలి రోజే 627మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా... వీటిలో 253 ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఉన్నాయి. తొమ్మిది అంతర్జాతీయ కంపెనీలతో పాటు మరో 250కి పైగా కంపెనీలు ఈ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో యాక్సెంచర్, బ్లాక్ రాక్, హెచ్ఎస్‌బీసీ, శాప్, ఎయిర్‌బస్, పీడబ్ల్యూసీ, నవీ, క్వాల్కమ్, డ్యూయిష్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ కంపెనీలూ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అద్భుతమైన ఆరంభంతో అంకిత భావం కలిగిన తమ విద్యార్థులు, అత్యుత్తమ అధ్యాపక సిబ్బంది, క్రియాశీలంగా పనిచేసే స్టూడెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీస్‌కు ఐఐటీ కాన్పూర్ శుభాకాంక్షలు చెప్పింది. ఈ ప్రయాణం కేవలం ఆరంభమేనని, త్వరలో అనేక కంపెనీలు రిక్రూట్‌మెంట్‌కు రాబోతున్నాయని, మరిన్ని గొప్ప అవకాశాలు ఉంటాయని తెలిపింది.

భావ్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఒక కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ నుంచి వెలువడిన మంటలు, పొగలు సమీపంలోని ఆస్పత్రులకు వ్యాపించాయి. స్థానికులు వెంటనే హాస్పిటల్స్‌లోని చిన్నారులను బయటకు తెచ్చి రక్షించడంతో పెద్ద గండం తప్పింది. బుధవారం ఉదయం కాలా నాలా ప్రాంతంలోని వివిధ ఆసుపత్రులు, షాపులున్న కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దేవ్ పాథాలజీ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. ఆ కాంప్లెక్స్‌లో ఉన్న ఆసుపత్రులు, ఇతర కార్యాలయాలకు మంటలు, పొగలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు నిచ్చెనల ద్వారా పైకి ఎక్కి ఒక ఆసుపత్రి నుంచి సుమారు 15 మందికి పైగా శిశువులు, చిన్నారులను చేతుల మీదుగా బయటకు తీసుకువచ్చారు. ఇతర హాస్పిటల్స్‌లోని రోగులు, వృద్ధులను కూడా క్షేమంగా తరలించారు. ఆరు అగ్నిమాపక వాహనాల్లో చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు.మరోవైపు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక అధికారి తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అది ముమ్మాటికీ మరణమే!

ఆరావళి పర్వతాల్లో మైనింగ్‌పై సోనియాగాంధీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటేనని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. దీనిపై సోనియాగాంధీ ఓ జాతీయమీడియా సంస్థకు రాసిన కథనంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కథనంలోని కొన్ని వాక్యాలను కాంగ్రెస్ షేర్ చేసింది. 'గుజరాత్, రాజస్థాన్, హర్యానాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలది దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా... మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది మైనర్లు, మాఫియాకు బహిరంగ ఆహ్వానం. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి' అని సోనియా డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన మార్పులను అంగీకరించిన సుప్రీంకోర్టు... అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలపై చేసిన సిఫారసులు పరిశీలించేందుకు అంగీకరించింది. సుస్థిర మైనింగ్ కోసం నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని పర్యావరణ మంత్రిత్వశాఖను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్రణాళిక ఖరారయ్యే వరకు మైనింగ్ కోసం కొత్తగా లీజులు ఇవ్వకూడదని ఆదేశాల్లో పేర్కొంది. కాగా... ప్రపంచంలోనే పురాతనమైన పర్వతశ్రేణుల్లో ఆరావళి ఒకటి. వాటిలో మితిమీరిన మానవ కార్యకలాపాలు, వనరుల దోపిడీ కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దానివల్ల కొన్ని రాష్ట్రాలతో పాటు రాజధాని ఢిల్లీ ప్రాంతం సైతం భవిష్యత్తులో తీవ్ర వాతావరణ దుష్పరిణామాలతో తల్లడిల్లే ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళనలు వినిపిస్తున్నాయి.

చరిత్ర వక్రీకరించొద్దు

వ్యూహాత్మక సవాళ్లపై దృష్టి పెట్టండి

రాజ్‌నాథ్‌కు కాంగ్రెస్ సలహా

న్యూఢిల్లీ: దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాధనంతో బాబ్రీ మసీదును నిర్మించాలని కోరుకున్నారని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా స్పందిస్తూ...చర్చించాల్సిన నిజమైన సమస్యల నుండి దృష్టిని మరల్చడమే లక్ష్యంగా రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. "ఇవన్నీ అంతరాయాలు. చర్చించాల్సిన అనేక ఇతర నిజమైన సమస్యలు ఉన్నాయి. అవి ప్రతిరోజూ కొత్త అంతరాయాన్ని సృష్టిస్తాయి. తద్వారా మనం నిజమైన ప్రజా సమస్యలను చట్టసభలో చర్చించలేకపోతున్నాము" అని ప్రియాంక అన్నారు. చండీగఢ్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ రక్షణ మంత్రి చరిత్రను వక్రీకరించడం మాని వ్యూహాత్మక సవాళ్లపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సహారన్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ... "ఆయన ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారో నాకు తెలియదు. మనకు ఒకే ఒక చారిత్రక పత్రం గురించి తెలుసు. అది పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించినది అయితే, వారి వద్ద ఆ పత్రం ఉండాలి" అని స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ అలా చెప్పినంత మాత్రాన ఎవరూ దానిని అంగీకరించరు. సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించడానికి చర్య తీసుకున్న ఒక పత్రం ఉంది... ఇదంతా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేశారు. ఆయన రోడ్‌మ్యాప్ నేడు దేశం అభివృద్ధి చెందుతున్న మార్గం. ఆయన శాస్త్రీయ ఆలోచనను కూడా పెంపొందించారని తెలిపారు. కాంగ్రెస్ తో పాటు, ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా రక్షణ మంత్రి వ్యాఖ్యలను విమర్శించాయి. బదౌన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ ధర్మేంద్ర యాదవ్, రాజ్ నాథ్ సింగ్ రక్షణ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. "రాజ్ నాథ్ సింగ్ చాలా అనుభవజ్ఞుడైన నాయకుడు. భారతదేశ రక్షణ మంత్రి, అతను మన సాయుధ దళాలు, యోధులకు సౌకర్యాలు సహా ఇతరత్రా అవసరమైనవి అందించడంపై దృష్టి పెట్టాలి... రక్షణ మంత్రికి అలాంటి విషయాల గురించి పూర్తిగా తెలియకపోవచ్చునని నేను నమ్ముతున్నాను. భారతీయ జనతా పార్టీ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడానికి ఎలా ప్రయత్నం చేస్తుందో మీకు తెలుసు. దేశం మొత్తం దీనిని అర్థం చేసుకుంటుందని నేను భావిస్తున్నాను" అని యాదవ్ అన్నారు.

ఆహ్వానిస్తేనే ఢిల్లీకి

సీఎం సిద్ధరామయ్య

మంగుళూరు : అధికారికంగా ఆహ్వానించబడకపోతే తాను న్యూఢిల్లీకి వెళ్లనని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం అన్నారు. ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ బుధవారం న్యూఢిల్లీలోని ఒక వివాహానికి హాజరు కావడానికి, పార్టీ పార్టీ కార్యక్రమానికి ప్రణాళికలు వేసుకోవడానికి వచ్చిన తర్వాత సీఎం వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహాగానాలను అరికట్టడానికి ఇద్దరు నాయకులు ఇటీవల బెంగళూరులోని తమ నివాసాలలో ఒకరికొకరు అల్పాహారం ఆతిథ్యం ఇవ్వడం ద్వారా స్నేహాన్ని ప్రదర్శించారు. ఉప ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లగా, మహాత్మా గాంధీతో సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు సమావేశమైన శతాబ్ది జ్ఞాపకార్థం జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి సిద్ధరామయ్య మంగళూరు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కూడా మంగళూరు కార్యక్రమానికి హాజరయ్యారు. తరువాత, సిద్ధరామయ్య వేణుగోపాల్‌తో సమావేశం, భోజనం చేశారు. ఇక్కడ కావేరి అతిథి గృహానికి వెళ్లే ముందు, ఆహ్వానం లేకుండా తాను ఢిల్లీకి వెళ్లనని సిద్ధరామయ్య మీడియాతో అన్నారు. శివకుమార్ ఢిల్లీ వెళుతున్నారని విలేకరులు అడుగగా, 'అతన్ని వెళ్లనివ్వండి. ఎవరైనా అతనికి నో చెప్పారా?' అని బదులిచ్చారు. మీరు వెళతారా అని అడిగినప్పుడు, నేను ఆహ్వానించినప్పుడే వెళతాను. నన్ను ఆహ్వానించలేదు. అందువల్ల నేను వెళ్లడం లేదు. ఢిల్లీలో జరిగే సమావేశానికి పార్టీ అధిష్టానం నుంచి ఏదైనా దిశానిర్దేశం ఉంటే, దానిని వేణుగోపాల్ ద్వారా తెలియజేస్తామని ఆయన అన్నారు. శివకుమార్ మాట్లాడుతూ తాను ఒక వివాహానికి హాజరు కావడానికి ఢిల్లీ వెళుతున్నానని చెప్పారు. డిసెంబరు 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓటు చోరీ' ప్రచారంపై జరిగే గొప్ప కార్యక్రమానికి సంబంధించి కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో చర్చకు ప్రణాళికలు కూడా ఆయన ప్రస్తావించారు. 'డిసెంబరు 14న ఢిల్లీలో 'ఓటు చోరీ' కార్యక్రమం జరుగుతోంది. అందువల్ల మేము ప్రతి జిల్లా నుంచి కనీసం 300 మంది కార్యకర్తలను ఢిల్లీకి తీసుకువెళుతున్నాము. మేము పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. వారిని ఢిల్లీకి తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా యూనిట్లకు చెప్పాను' అని ఢిల్లీ వెళ్లే ముందు శివకుమార్ మీడియాతో అన్నారు. వేణుగోపాల్‌తో సిద్ధరామయ్య సమావేశం గురించి శివకుమార్ ప్రశ్నించగా, వేణుగోపాల్, రాహుల్ గాంధీ లేదా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం కలవడంలో తప్పేంటి?' అని ప్రశ్నించారు. ఆయన మద్దతుదారులపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, వేణుగోపాల్ వచ్చిన తర్వాత మంగళూరు విమానాశ్రయంలో నినాదాలు చేస్తూ, 'ఇందులో తప్పేముంది?' అని ప్రశ్నించారు

పాక్ ఐఎస్ఐ కోసం లాయర్ గూఢచర్యం

న్యూఢిల్లీ: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన న్యాయవాది రిజ్వాన్ అరెస్టయ్యాడు. అతడు డబ్బులు తీసుకోవడానికి ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడని పోలీసుల అదుపులో ఉన్న అతడి స్నేహితుడు ముషారఫ్ అలియాస్ పర్వేజ్ వెల్లడించాడు. ఈ మేరకు దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2022లో సోహ్నా కోర్టులో ఇంటర్న్‌షిప్ చేస్తోన్న సమయంలో రిజ్వాన్, ముషారఫ్ స్నేహితులయ్యారు. తర్వాత వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయినా... వృత్తిపరంగా తరచూ కలిసేవాళ్లమని ముషారఫ్ వెల్లడించాడు. అతడు తరచూ అమృత్‌సర్ వెళ్లేవాడని, ఈ జులైలో అతడితో కలిసి తాను కూడా వెళ్లానని చెప్పాడు. అప్పుడు వాఘా సరిహద్దు వద్ద బైక్ మీద వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక బ్యాగ్‌లో రిజ్వాన్‌కు డబ్బు ఇచ్చారని తెలిపాడు. ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరో తనకు తెలియదన్నాడు. రిజ్వాన్ ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడని, అతడు తీసుకున్న నగదులో రూ.41 లక్షలు అజయ్ అరోరా అనే వ్యక్తికి ఇచ్చినట్లు ముషారఫ్ వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల్లో రిజ్వాన్‌కు ఖాతాలు ఉన్నాయని, లావాదేవీల పరిమితి దాటడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతా మూత పడిందని అధికారులు వెల్లడించారు. పాకిస్థానీ హ్యాండ్లర్ల నుంచి కోట్లాది రూపాయలు అతడి ఖాతాలో జమ అయ్యాయని, పంజాబ్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి చాలా మొత్తాన్ని ఉపయోగించాడని తెలిపారు. రిజ్వాన్ ఫోన్, ల్యాప్‌టాప్‌లో అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. పాకిస్థాన్‌కు గూఢచర్యం కేసును విచారిస్తోన్న నుహ్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ ఇద్దరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ఈ హవాలా డబ్బు చేతులు మారిన వ్యవహారంలో వారిని నిందితులుగా పేర్కొంది.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలి

బెంగాల్ ఎంపీలకు మోదీ ఆదేశం



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోంది.

దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని మోదీ ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా... విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ బీజేపీ ఎంపీలకు చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ ఎదిగిన తీరును ప్రస్తావిస్తూ 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరిందన్నారు. కాగా... కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి.

జుబీన్ గర్గ్‌కు న్యాయం జరగాలి

లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు గొగోయ్

న్యూఢిల్లీ : సెప్టెంబరులో సింగపూర్‌లో మరణించిన అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు-స్వరకర్త జుబీన్ గర్గ్‌కు న్యాయం జరగాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ బుధవారం కోరారు. లోక్ సభలో జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన గొగోయ్... ఈశాన్య రాష్ట్రం తిరుగుబాటు గుప్పిట్లో ఉన్నప్పుడు 1980లు, 1990 లలో అసోం ప్రజలకు ఆశ కలిగించిన మానవతావాదిగా గర్గ్‌ను ప్రశంసిస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ అసోం రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన గొగోయ్... ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను గార్గ్‌కు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు. 'జుబీన్ గర్గ్ ఒక దిగ్గజ సంగీత విద్వాంసుడు. విదేశాంగ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వం, సింగపూర్‌కు హైకమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శన ఇవ్వాల్సి ఉండగా ఆయన సింగపూర్‌లో మరణించారు' అని ఆయన అన్నారు. గర్గ్ ఒక కళాకారుడు, మానవతావాది, పర్యావరణవేత్త, వన్యప్రాణుల ఔత్సాహికుడు, ఆసక్తిగల పాఠకుడని గొగోయ్ అన్నారు. '80లు, 90లలో ఆయన అసోం ప్రజలకు ఆశను కలిగించారు. ఇటీవలి సంవత్సరాలలో ఆయన మాకు నైతిక ధైర్యాన్ని ఇచ్చారు. వ్యక్తిగత గాయాన్ని ఎలా అధిగమించాలో, మతం, కులం ద్వారా విభజించబడకూడదని ఆయన మాకు నేర్పించారు' అని గొగోయ్ తెలిపారు. గర్గ్ హత్యకు గురయ్యారని అసోం ప్రభుత్వం చెప్పిందని ఆయన అన్నారు. 'భారత ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో, విదేశీ గడ్డపై హత్య ఎలా జరిగిందో మేము తెలుసుకోవాలనుకుంటున్నాము' అని అన్నారు. 'ఈరోజు అసోం ప్రజలు ఆయనను కోల్పోయారు. మేము ఆయనకు న్యాయం జరగాలని కోరుకుంటున్నాము' అని జోర్హాట్ నియోజకవర్గ లోక్‌సభ సభ్యుడు గొగోయ్ అన్నారు.

బహుజనులకు మోదీ సర్కార్ మోసం

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని బహుజనులకు బహిరంగంగా మోసం చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. కుల గణన కసరత్తు 'ఒక నిర్దిష్ట చట్రం, ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక లేదు. పార్లమెంటులో చర్చ లేదు, ప్రజలతోనూ చర్చించలేదు' అని తెలిపారు. తదుపరి జన గణన, కుల గణనపై తన ప్రశ్నకు లోక్‌సభలో ప్రభుత్వం స్పందించిన తర్వాత రాహుల్ ఈ విమర్శల దాడి చేశారు. 'పార్లమెంటులో నేను ప్రభుత్వాన్ని కుల గణన గురించి ఒక ప్రశ్న అడిగాను. దానికి ప్రతిస్పందన దిగ్భ్రాంతికరంగా ఉంది. నిర్దిష్ట చట్రం లేదు. ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక లేదు. పార్లమెంటులో చర్చ లేదు. ప్రజలతోనూ చర్చించలేదు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన కుల సర్వేల వ్యూహాల నుంచి నేర్చుకోవాలనే కోరిక కూడా లేదు' అని 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కుల గణనపై మోదీ ప్రభుత్వ వైఖరి దేశ బహుజనులను బహిరంగంగా మోసం చేసింది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తెలిపారు. మంగళవారం లోక్‌సభలో గాంధీ మూడు ప్రశ్నలు సంధించారు. దశాబ్ది జనాభా గణనకు సిద్ధం కావడానికి కీలకమైన విధానపరమైన దశల వివరాలు, తాత్కాలిక కాలక్రమాలను, షెడ్యూళ్లను నిర్ణయించడం వంటి వాటి గురించి అడిగారు. ముసాయిదా జనాభా గణన ప్రశ్నలను ప్రచురించి, ఈ ప్రశ్నలపై సాధారణ ప్రజల నుంచి లేదా ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు కోరే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉందా అని కూడా ఆయన ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన కుల సర్వేలతో సహా మునుపటి కసరత్తుల నుంచి ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా? మరి అలా అయితే వాటి వివరాలను కూడా కాంగ్రెస్ అగ్ర నేత అడిగారు.

చిన్నారిని కాపాడిన వీధి కుక్కలు

కోల్‌కతా: చిన్నారులపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ... అప్పుడే పుట్టిన చిన్నారికి వీధి కుక్కలే రక్షణగా మారిన ఘటన వైరల్‌గా మారింది. ఓ నవజాత శిశువును కన్నవారు రోడ్డుపై వదిలేస్తే... చిన్నారికి వీధి కుక్కలు రక్షణగా నిలిచిన ఘటన పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నదియా జిల్లాలోని రైల్వేవర్కర్స్ కాలనీలో ఓ బాత్‌రూమ్ ఎదుట అప్పుడే పుట్టిన పసికందును తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. దుప్పటిలో చుట్టి ఉన్న ఆ పసికందు చుట్టూ వీధి కుక్కలు చేరి... ఉదయం వరకు చిన్నారికి రక్షణగా ఉన్నాయి. తెల్లవారిన తర్వాత కుక్కల మధ్యలో చిన్నారి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు... వెంటనే ఆ పసికందును ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పసికందుపై కుక్కలు వ్యవహరించిన తీరును స్థానికులు ప్రశంసించారు. చిన్నారి చుట్టూ చేరిన కుక్కలు చలిలో కొన్ని గంటల పాటు పసికందుకు కాపలాగా నిలబడే ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్నారిని ఆస్పత్రికి తరలించడానికి వెళ్లినప్పుడు ముందు ఎవరినీ దగ్గరకు రానివ్వలేదని, అనంతరం పొరుగువారి సాయంతో శిశువును మహేశ్‌గంజ్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని... చిన్నారిని ఎవరు వదిలివెళ్లారనే విషయం తెలుసుకోవడానికి స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆప్‌పై ప్రజల విశ్వాసం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఉప ఎన్నికల ఫలితాలు కేవలం 10 నెలల్లోనే ఆప్ పై ప్రజల తిరిగి విశ్వాసం ప్రదర్శిస్తున్నారని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అన్నారు. ఢిల్లీలో మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న ఆప్, ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓడిపోయింది. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీకి 12 వార్డులకు జరిగిన ఎంసీడీ ఉప ఎన్నికలు అగ్నిపరీక్షగా పరిగణించబడుతున్నాయి. బీజేపీ గతంలో తొమ్మిది వార్డుల్లో ఏడింటిని గెలుచుకోగా, ఆప్ మూడు, కాంగ్రెస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఒక్కో వార్డును గెలుచుకున్నాయి. ఆప్ గతంలో చాందినీ మహల్, చాందినీ చౌక్ వార్డులను కోల్పోయింది. కానీ ముండ్కా, దక్షిణపురి, నరైనాను గెలుచుకుంది. 'ఈసారి ఎంసీడీ ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తన అంకితభావంతో పనిచేసే కార్యకర్తలను అభ్యర్థులుగా నిలబెట్టింది. దాని తీర్పు ద్వారా ఢిల్లీ ప్రజలు నగరంలో ఆప్‌నకు అనుకూలంగా ప్రజల మద్దతు క్రమంగా బలపడుతోందని స్పష్టం చేశారు' అని కేజ్రీవాల్ 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. కేవలం 10 నెలల్లో ప్రజల విశ్వాసం మరోసారి ఆమ్ ఆద్మీ పార్టీ వైపు వేగంగా తిరిగి వస్తోందని ఆయన తెలిపారు. 'ఢిల్లీలో త్వరలో సానుకూల రాజకీయాలకు, సుపరిపాలనకు తిరిగి వస్తోంది' అని అన్నారు. కాగా బీజేపీ ఈ పరీక్షలో విఫలమైందని, దేశ రాజధానిలో అది తన స్థానాన్ని కోల్పోతోందని ఆప్ నాయకులు తెలిపారు.

మూడేళ్లలో రెండు లక్షల శ్వాస కోశ వ్యాధులు: కేంద్రం

న్యూఢిల్లీ: వాయు కాలుష్యంతో ఢిల్లీలో మూడేళ్లలో రెండు లక్షలకు పైగా తీవ్రమైన శ్వాసకోశ వ్యాధుల కేసులు నమోదైనట్లు కేంద్రం బుధవారం పార్లమెంటుకు తెలిపింది. 2022-2024 మధ్య ఢిల్లీలోని ఆరు ప్రధాన కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోని అత్యవసర విభాగాల్లో 2,04,758 తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్య (ఏఆర్ఐ) కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో 30,420 మంది రోగులు సుమారు 15 శాతం మంది ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. ఇది ఢిల్లీలో దీర్ఘకాలిక వాయు కాలుష్య సంక్షోభంతో తీవ్రమైన ఆరోగ్య నష్టాన్ని వెల్లడిస్తోంది. 2024లో మొత్తం అత్యవసర సందర్శనలలో స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ... అడ్మిషన్ అవసరమైన రోగుల సంఖ్య బాగా పెరిగింది, ఇది ఆసుపత్రులకు వచ్చే కేసులు మరింత తీవ్రంగా మారుతున్నట్లు సూచిస్తోందని కేంద్రం తెలిపింది. వాయు కాలుష్యం శ్వాసకోశ వ్యాధులు, సంబంధిత వ్యాధులను కలిగించే కారకాల్లో ఒకటి అని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఆహారం, వృత్తి, సామాజిక ఆర్థిక స్థితి, ముందుగా ఉన్న పరిస్థితులు సహా బహుళ కారకాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని స్పష్టం చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పలు నగరాల్లో నిర్వహించిన అధ్యయనంలో కాలుష్య స్థాయిలలో పెరుగుదల శ్వాసకోశ వ్యాధులతో అత్యవసర విభాగాల్లో చేరే వారిసంఖ్య పెరుగుదలతో నేరుగా ముడిపడి ఉందని తేలింది. 33 వేల కంటే ఎక్కువ మంది రోగులలో, క్షీణిస్తున్న గాలి నాణ్యత, శ్వాసకోశ అనారోగ్యం మధ్య స్పష్టమైన సంబంధం ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే, అధ్యయనం ప్రత్యక్ష కారణాన్ని నిరూపించలేకపోయింది. అలాగే, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ఆగస్టు 2023 నుండి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ (ఐహెచ్‌సీ) ద్వారా వాయు కాలుష్య సంబంధిత వ్యాధుల డిజిటల్ నిఘాను చేపడుతోంది. ఢిల్లీలోని ఆరు ప్రాంతాలు సహా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో 230 కంటే ఎక్కువ సెంటినెల్ సైట్‌లను కవర్ చేసినట్లు తెలిపింది. రాజ్యసభ ఎంపీ డాక్టర్ విక్రమ్‌జిత్ సింగ్ సాహ్ని (నామినేట్ సభ్యులు) లేవనెత్తిన ప్రశ్నకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నేరెడ్ మెట్ అంబేడ్కర్‌భవన్‌లో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అధితిగా మాజీ కేంద్ర మంత్రి వర్యులు సర్వే సత్యనారాయణ హాజరై మానవతా ఆసరా ట్రస్ట్ ఆధ్వర్యంలో దివాకచంగేల హక్కుల పోరాట సమితి సహకారంతో 100 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేవారు. అంతకు ముందు సర్వే. సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, గతంలో లక్ష మందికి ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇప్పించానని, ఇప్పుడు దివ్యాంగులకు ఇండ్లు పెన్షన్స్ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మానవతా అసరా ట్రస్ట్ డైరెక్టర్ సిలుముల క్రిష్ణ మాట్లాడుతూ పేదల కోసం దివ్యాంగుల కోసం వృద్ధుల కోసం అండగా ఉంటుందని తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వినయచ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి వాళ్ళ సహాయక సహకారాలు అందించినందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా ఆసరా ట్రస్ట్ కార్యదర్శి ఎం.దుర్గేష్, సహాయక కార్యదర్శి పి.విష్ణు, సభ్యులు బి.స్వామి, అంజయ్య, అంబేడ్కర్ భవన్ అధ్యక్షులు పి.శ్రీనివాస్, బిఎస్.పి పార్టీ మల్కాజిగిరి ఇంచార్జ్ గౌతమ్ రాజ్, నర్సింహా, టిడిపి నాయకులు బి.నర్సింహా గౌడ్, విఎచ్.పిఎస్ మహిళ అధ్యక్షురాలు ఎన్.శాంతా బాయి, సీత మహాలక్ష్మి, శాంతి కుమారి, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : పేద మధ్యతరగతి పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త అన్నారు. మంగళవారం కీసర మండల పరిధిలోని, నాగారం మునిసిపాలిటీలోని, రాంపల్లి 2 బి.హెచ్.కె కాలనీలో నూతన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త లాంఛనంగా ప్రారంభించారు. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కీసర మండల విద్యాధికారి ఎం జమదగ్ని, కీసర కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, చీర్యాలకాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, రాంపల్లి 2బి.హెచ్.కె. కాలనికి సంబంధించిన 52 బ్లాక్ల చైర్ పర్సన్స్, స్థానిక ప్రజా ప్రతినిధుల పెద్దల సహకారంతో షాపింగ్ కాంప్లెక్స్లో అలాట్ చేసిన మూడు హాల్స్లో ఈ పాఠశాలను శ్రీనివాస్ ఎస్ జి టి ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి అయిదవ తరగతి వరకు ముప్పై మంది విద్యార్థులతో ఏర్పాటు చేసామన్నారు. జిల్లా ఏఎస్ఓ అయ్యన్న ఇక్కడి వసతులను ఎండిఎం అవకాశాలను పరిశీలించారని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్త కాలనీ వాసులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కాలనీలో నివసించే 52 బ్లాక్ల కుటుంబాల పిల్లల కోసం ఒక కిలోమీటర్ పరిధిలో ఎటువంటి ప్రభుత్వ పాఠశాల లేనందున ప్రభుత్వం విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ద్వారా ఈ పాఠశాలని ఏర్పాటు చేశామని, త్వరలో అక్కడే నూతన భవనాన్ని సీఎస్ఐఆర్ దాతల ద్వారా వెంటనే నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎక్కడైనా బడిగుడి అభివృద్ధిలో రాజకీయాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా ముందుకి వచ్చి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఒక మంచి భవనం నిర్మించుకుందాం అని తెలిపారు. పేద మధ్యతరగతి పిల్లలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని. కాలనీలో ఉన్న అందరూ తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రైవేట్ బడులలోకి పంపకుండా విధిగా ఈ బడిలోనే పిల్లలను ఎక్కువ సంఖ్యలో చేర్పించగలరని అడిషనల్ కలెక్టర్ కోరారు.

అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి కమిషనర్‌కి వినతి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్లో గల పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాల యంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్లో నెలకొన్న అనేక సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఈ రోజు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో గౌరవ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్‌ని మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగినదని అని, మియాపూర్ డివిజన్ పరిధిలో చేపట్టబడిన నాలల విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, పెండింగ్లో ఉన్న అన్ని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలని జిహెచ్ఎంసి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు, రోడ్ల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయడం, మట్టి రోడ్లు ఉన్న ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణం,చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, కాలనీలలో విధి దీపాల సమర్థవంతమైన ఏర్పాటు కోసం తక్షణమే నిధులు విడుదల చేయాలని, అభివృద్ధి పనులలో వేగం పెంచడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు అందించడంలో ఎక్కడా రాజీ పడకూడదని, అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. దీనిపై గౌరవ జిహెచ్ఎంసి కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

PUBLIC NOTICE

NOTICE is Hereby given to the public that my client **"ENISTEN EDUCATIONAL SOCIETY"** Regd No: 790/2008. Which will be held on 06/05/2025 & Regd office. #103, Sunny Residency, Mothinagar, Hyderabad-Telangana. But change of Executive But body Inform to the public. Now Details of Executive of New General Body

Sl.No.	NAME OF THE MEMBER	DESIGNATION
1.	Jagarlamudi Venkata Subba Rao	President
2.	Boppana Ramesh	Vice President
3.	Kandra Leela Shanker	General Secretary
4.	Jagarlamudi Rajani	Joint- Secretary
5.	Velagapudi Rajitha	Treasurer
6.	Anubrolu Srinivasa Rao	Execute Member
7.	Jagarlamudi Viswesara Rao	Executive Member

Any Person, Institution, Authority or entity having any claim, objection, right, interest, Lien, charge or dispute of any nature what soever in respect of the said educational Society, is here by called upon to submit such objection or claim in Writing along with Supporting Documents, with in 10 (Ten) days from the date of publication of this notice. if no objection are received with in the stipulated Period. It shall be presumed that there are no claims or objections of my client.

Peram Sai Babu
Banda Janardhan Reddy
Advocates
 # G-3, Kalinga Dreams, MJ Colony, Moula-Ali, Hyderabad – 500 040. Ph: 9440183628, 8639960743

పటిష్టంగా గ్లోబల్ సమ్మిట్ బందోబస్త్ ఏర్పాట్లు

విశాలాంధ్ర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ బుధవారం ఫ్యూచర్ సిటీలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రాచకొండ సిపి సుధీర్ బాబు, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, ఐజిపి రమేష్ రెడ్డితో కలిసి బందోబస్త్ ఏర్పాటును.. గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి మొత్తం మీటింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మహేష్ భగవత్ మాట్లాడుతూ.. బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జా తీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునం దున లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ప్రతినిధులు, బహుళ సంస్థల అధినేతలు, దేశీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో కలిపి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూముల అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయి.

రోడ్డు సేఫ్టీ డ్రైవ్ వేగవంతం

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, నగర పౌరుల ప్రయాణం సజావుగా జరిగేలా చూసేందుకు ఉద్దేశించిన రోడ్డు సేఫ్టీ డ్రైవ్ ముమ్మరంగా సాగుతుంది. రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, రోడ్ల మరమ్మత్తు పనులు, ప్యాచ్ వర్క్ పనులు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల మేరకు మేరకు జీహెచ్ఎంసీ మెయింటెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ క్షేత్ర స్థాయిలో డ్రైవ్ ను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. డిసెంబర్ 3వ తేదీ నాటికి నగరంలో మొత్తం 23,058 గుంతలు గుర్తించడం జరిగింది. వాటిలో 21,786 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 1,032 క్యాచ్ పిట్స్ రిపేర్‌లు, 495 కవర్ రీప్లేస్‌మెంట్‌లు, 13 సెంట్రల్ మీడియన్ మరమ్మతులు పూర్తి అయ్యాయి. జోన్ల వారీగా వివరాలు ఎల్.బి.నగర్ జోన్‌లో 3,888 గుంతను, చార్మినార్ జోన్‌లో 2,885 ,ఖైరతాబాద్ జోన్‌లో 3,785, శేరిలింగంపల్లి జోన్‌లో 2,731 ,కూకట్‌పల్లి జోన్‌లో 3,258, సికింద్రాబాద్ జోన్‌లో 5,239 మొత్తం 21,786 గుంతలను పూడ్చడం జరిగింది.

భూ కుంభకోణంపై బీఆర్ఎస్ పోరుబాట

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మౌలాలి పారిశ్రామిక వాడలో బుధవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదన చారి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, పారిశ్రామిక వాడల ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతాల్లోని కోట్ల రూపాయల విలువైన భూములను తక్కువ ధరకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. హైదరాబాద్ నగర పరిధిలోని సుమారు 5 లక్షల కోట్ల రూపాయల భూములను 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు చేస్తున్నదని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ భూ దోపిడీపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు పరిశ్రమల అభివృద్ధి కోసం రైతులు ఇచ్చిన భూములను అతి తక్కువ ధరకే కేటాయించాయి. ఆ భూములను ఇప్పుడు మల్టీ-యూజ్ జోన్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మార్చి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే చాలా తక్కువైన ఎస్ఆర్ఓ రేటు 30%కే రెగ్యులరైజ్ చేసి, రాష్ట్ర ప్రజలకు రూ. 5 లక్షల కోట్ల భారీ నష్టం కలిగించే కుట్ర జరుగుతోందన్నారు. అంతేకాక, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు, గిరిజన, దళిత గురుకుల పాఠశాలలు, లైబ్రరీలు, యుపిహెచ్‌సి ఆసుపత్రుల కోసం భూమి లేదని చెప్పే ప్రభుత్వం, వేల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నదని ఎమ్మెల్యే తీవ్రంగా విమర్శించారు. పార్టీ నేతలు మరింతగా మాట్లాడుతూ... ప్రజలు పారిశ్రామిక వాడల ఏర్పాటుకు నమ్మకంతో ఇచ్చిన భూములను, ప్రభుత్వం అప్పట్లో చేసిన కేటాయింపులను, వాటి అసలు ఉద్దేశాలను ఇప్పుడు పూర్తిగా విస్మరించి, రియల్ ఎస్టేట్‌కు మళ్లించడం కాంగ్రెస్ ప్రభుత్వ దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, జేఏసీ వెంకన్న,రావుల అంజయ్య, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, జీకే హనుమంత్ రావు, చిన్న యాదవ్, డోలి రమేష్, డిల్లీ పరమేష్, శోభన్ బాబు, మోసిన్, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, హేమంత్ పటేల్, సురేష్, శివ గౌడ్, యువకులు, మహిళలు, కార్యకర్తలు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : తాగునీరు, సీవరేజ్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని అశోక్ రెడ్డి ఆదేశంనగరంలో ఎలాంటి తాగునీరు, సీవరేజ్ ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. నెలవారీ నిర్వహించే ఈ మీటింగ్ లో పలు కీలక సూచనలు, ఆదేశాలిచ్చారు. నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అన్ని ముఖ్య ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలు పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎంసీసీ పిర్యాదు లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కలుషితనీరు సమస్యలను పరిష్కరించడానికి ప్రాముఖ్యతనివ్వాలి సూచించారు. పగటి పూట ప్రధాన రహదారుల్లో ఏదైనా సమస్యలు పరిష్కరానికి చేపట్టే మరమ్మతులతో ట్రాఫిక్ ఆటంకం కాకుండా.. రాత్రిపూట పనులను చేపట్టాలని సూచించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

జర్నలిస్టుల మహా ధర్నా విజయవంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పన్నెండేండ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మహా ధర్నా అనూహ్యరీతిలో విజయవంతం అయ్యింది. టీయూడబ్ల్యూజే పిలుపుపై స్పందించి, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఏంతో ఉత్సాహంగా, భారీగా జర్నలిస్టులు తరలి రావడం విశేషం. జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. సమాచార శాఖ చరిత్రలో, ఆ కార్యాలయం వద్ద ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ధర్నా చేయడం ప్రప్రథమని పోలీసు అధికారులతో సహా పలువురు సీనియర్ పాత్రికేయులు చర్చించుకోవడం విశేషం. ఈ మహా ధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏలు సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో భాగస్వామ్యమయ్యాయి. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం. ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ,ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు వి. యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి,మధు గౌడ్, ఫైసల్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు మాట్లాడారు.

ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు సత్కారం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: అఖిల భారత యాదవ్ మహాసభ నేషనల్ సెక్రటరీ మహేందర్ యాదవ్ ఆహ్వానం మేరకు ఆయన నివాసంలో అల్పాహారం కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్. అల్పాహార విందు కార్యక్రమానికి వచ్చిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, బోయిన్‌పల్లి కార్పొరేటర్ నరసింహ యాదవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల సమస్యలు పరిష్కారానికి నోచుకొనేలా అసెంబ్లీలో చర్చించాలని కోరారు. యాదవ్, బీసీ యువత ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి రావాలని కోరారు. అనంతరం కరీంనగర్ జిల్లా యాదవ్, బీసీ సంఘాల నాయకులు పాల్గొని నవీన్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దొంతి బోయిన శ్రీనివాస్ యాదవ్, బీసీ నాయకులు అందెల కుమార్ యాదవ్, యాదవ్, బీసీ సంఘాల నాయకులు, మహేందర్ యాదవ గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలు అందించిన క్రైస్తవులకు సత్కారం

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే క్రిస్టమస్ వేడుకల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన క్రైస్తవ అభ్యర్థులు అలాగే సంస్థలను సత్కరించడం జరుగుతుందని, ఇందుకు నామినేషన్లు ఆహ్వానించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం. డి ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.సామాజిక సేవ, విశిష్ట వైద్య సేవలు, బోధన, సాహిత్యం, కళలు మరియు క్రీడా రంగాల్లో 10 సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలను అందించిన క్రైస్తవులు, అదేవిదంగా విద్య మరియు సామాజిక సేవ రంగాల్లో 30 సంవత్సరాలకు పైగా సేవలను అందించిన క్రైస్తవ సంస్థలు ఈ అవార్డుకు అర్హులని తెలిపారు. నామినేషన్లను ఆన్లైన్లో: https://www.tgcmfc.in ద్వారా పంపాలని దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో 1 నుంచి 6 వరకు వరకు సమర్పించాలన్నారు.

కాలనీ మధ్యలో అక్రమ వైన్‌షాప్ నిర్మాణం

వైన్‌షాపు నిర్మాణంపై కాలనీవాసుల ఆందోళన

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : కొండాపూర్ రాజరాజేశ్వరి నగర్‌లో అక్రమంగా సాగుతున్న వైన్‌షాప్ నిర్మాణంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కాలనీ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో బగ్గ వైన్స్ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టి జోనింగ్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోరడేకు వినతిపత్రం అందజేస్తూ జనసంచారం అధికంగా ఉండే మహిళలు పిల్లలు పెద్దలు ఎప్పటికప్పుడు తిరిగే ఈ ప్రాంతంలో వైన్‌షాప్ ఏర్పాటు చేయడం పూర్తిగా తప్పు అని పేర్కొన్నారు. నిర్మాణం జరుగుతున్న చోట పాఠశాలలు ఇళ్ల సముదాయాలు ఉండటంతో ప్రజల భద్రతకు నేరుగా ముప్పు ఏర్పడుతోందని చెప్పారు. భవన నిర్మాణ ప్రమాణాలు భద్రతా నిబంధనలు జోనింగ్ నియమాలు ఏవీ పాటించకుండా పనులు కొనసాగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశార. బగ్గ వైన్స్‌కు ఈ ప్రాంతంలో వైన్‌షాప్ ఏర్పాటుకు అనుమతులున్నాయా లేదో అధికారులు వెంటనే పరిశీలించాలని కోరారు అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి ఇప్పటివరకు చేసిన నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని స్పష్టం చేశారు అక్రమాలను అడ్డుకోవాల్సిన శాఖలే స్పందించకపోవడంతో కాలనీలో అసంతృప్తి పెరుగుతోంది.

శేఖర్‌ది హత్య లేక ఆత్మహత్యా?

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికల వేళ అపశృతి చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామంలో ఆవశేఖర్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడడంతో సంచలనంగా మారింది. ఆవశేఖర్ గ్రామ 4వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తుండడం ఇంతలోనే ఆవశేఖర్ రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న సమాచారం గ్రామాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. రైల్వే పోలీసులు గ్రామస్తులకు అందించిన సమాచారం ప్రకారం రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడని భావిస్తున్న పోలీసులు.. మృతదేహం వద్ద ఆధార్ కార్డు లభించడంతో అతను కంసాన్ పల్లికి చెందిన ఆవశేఖర్‌గా గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందజేశారు. ఆవశేఖర్ కంసాన్‌పల్లి గ్రామ నాలుగో వార్డు సభ్యుడు పదవికి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గత నాలుగు రోజులుగా గ్రామంలో కొందరు శేఖర్‌ను పోటీ నుండి తప్పుకోవాలని తన నామినేషన్ ఉపసంహరించుకోవాలని కొందరు ఒత్తిడి తీసుకురావడం వేధింపులకు గురిచేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నామినేషన్ ఉపసంహరించుకోకపోతే లేనిపోని అవంతరాలు సృష్టించి కేసులు పెడతామని, శేఖర్‌ను కొందరు బెదిరించినట్లు గ్రామస్తులు కొందరు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శేఖర్ గ్రామంలో కొంతమంది వద్ద ఈ విషయం చెప్పి కన్నీరు మున్నీరుగా విలపించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కొంతమంది గ్రామానికి చెందిన వారు తనను నామినేషన్ ఉపసంహరించు కోవాలని చెబుతున్నారని గ్రామ పెద్దల దృష్టికి కూడా తీసుకువచ్చినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శేఖర్ మంగళవారం ఉదయం కనిపించకుండా పోయాడు. కాసేపటి క్రితం రైల్వే పోలీసులు ఆవశేఖర్ రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం చెప్పడంతో అది హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో పోలీసులు కూడా దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం రైల్వే పోలీసులు విచారణ జరుపుతున్నారు అదేవిధంగా ఈ మృతి వెనుక రాజకీయ కోణం గ్రామపంచాయతీ ఎన్నికల వ్యవహారం ఉందని ఆరోపణలు వస్తుండడంతో ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా :మామిడి

విశాలాంధ్ర - మొయినాబాద్: ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి మామిడి మోహన్ రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ అభి వృద్ధి కోసం మాజీ సర్పంచ్ వినీత కరుణాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామాన్ని మరిం త అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మోహన్ రెడ్డి వెల్లడించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఉద్యో గపరంగా సేవ చేశానని తెలిపారు. ప్రజాసేవ పరమావిధిగా గ్రామాన్ని గ్రామస్తుల సహకారంతో ముందుకు తీసుకెళ్తానని ఆయన అన్నారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం గ్రామస్తుల సహకారంతో నడిపిస్తానని, గ్రామస్తులు ఆశయాల మేరకు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలుపుతానని పేర్కొన్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాల కొర కై యువత కృషి చేస్తున్న వారికి తన సూచనలు, సలహాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వినీత కరుణాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో మహా ధర్నాకు షాద్ నగర్ జర్నలిస్టులు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: జర్నలిస్టుల హక్కులకు ఐక్యంగా పోరాడి విజయాన్ని సాధిద్దాం అనే నినాదంతో చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ జర్నలిస్టులు రాష్ట్ర మఫిషియల్ కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్ సమక్షంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు మహాధర్నాకు బయలుదేరారు. ఏ ప్రభుత్వం అధికారం వచ్చినా కేవలం హామీలకే పరిమితమై జర్నలిస్టులకు మేలు చేయడం లేదని టీయూడబ్ల్యూజే ఐజేయు నాయకులు అన్నారు. అదేవిధంగా మహాధర్నకు బయలుదేరే ముందు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.బుధవారం నాడు మహాధర్నా నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశం అక్రిడేషన్ జారీ చేయడంలో నిర్లక్ష్యం, అదేవిధంగా ఇళ్ల స్థలాలను ఇవ్వకపోవడం, హెల్త్ కార్డులు జారీ చేయకపోవడం వంటి ఎన్నో నిర్లక్ష్యపు వాగ్దానాలు అదేవిధంగా జర్నలిస్టుల కుటుంబానికి హాస్పిటల్లో చికిత్సకు అవకాశం కల్పించాలంటూ విన్నవించడానికి మహాధర్నా ద్వారా ప్రభుత్వానికి మేలుకొలిపి విజయం సాధించాలనే సంకల్పంతో మహాధర్నా కార్యక్రమం రూపు దాల్చిందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి టీయుడబ్ల్యూజే (ఐజేయు) ఎల్లప్పుడూ కూడా పోరాటం చేస్తుందని వెల్లడించారు. జర్నలిస్టులకు మేలు జరిగే వరకే పోరాటం ఆగదని వెల్లడించారు. పెద్ద ఎత్తున జర్నలిస్టులు మహా ధర్నా కార్యక్రమానికి హాజరై టీయూడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దన్నారం రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నరసింహ, గౌరవ అధ్యక్షులు ఫెరోస్ ఖాన్, జిల్లా ఈసీ మెంబర్ ఇలియాస్, ప్రింట్ మీడియా అధ్యక్షులు ఫణీంద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ నాయక్, ప్రధాన కార్యదర్శి నీరటి శివకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఫయాజ్, షాద్ నగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్, జర్నలిస్టులు రజాక్, ఆకుల శ్రీనివాస్, సమీ,సాబేర్ జగన్, సవాళ్ల రాజు,వై. శేఖర్ యాదవ్, బంగారు మల్లేష్, రవి, శివకుమార్ గౌడ్, శ్రావణ్ గౌడ్, నూరుద్దీన్, అనిల్, పెద్ద ఎత్తున జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ..

విశాలాంధ్ర-కొత్తూరు: కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 54 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా బుధవారం చివరిరోజు 22 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసం హరించుకున్నారు. చివరకు 32 మంది బరిలో నిలిచారు. మండలంలో మొత్తం 12 పంచాయతీలలో 110 వార్డులకు గాను 299 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేయగా చివరి రోజు 75 మంది ఉపసంహరిం చుకున్నారు. 254 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు. అదేవిధంగా మండలంలోని గూడూరు 1, ఇనుముల్ నర్వ 1, కొడిచెర్ల 1, మత్తగూడ 7,మల్లాపూర్ 1, మల్లాపూర్ తండా 5,పెంజర్ల 4, వైయం తండా 2, మొత్తము 22 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు.

నందిగామ మండలం..

నందిగామ మండలంలో 19 పంచాయతీలకు గాను నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 54 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. 170 వార్డులకు గాను 11 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 401 మంది వార్డు సభ్యులు పోటీకి సిద్ధమయ్యారు. కన్హా గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. దింతో పాటు చాకలి దానిగుట్ట తండా 5వ, బుగ్గోని గూడ 4వ వార్డ్, రంగాపూర్ 7వ వార్డు లు ఏకగ్రీవమైనట్లు వివరించారు.

ఉద్యమకారుడికి మైనంపల్లి ఆర్థిక సాయం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గుండెపోటుతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్కాజిగిరి తెలంగాణ ఉద్యమకారుడు నయీంఖాన్‌ను మల్కాజిగిరి మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హను మంతరావు బుధవారం యశోద ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా నయీంఖాన్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయంగా రూ.2 లక్షల నగదును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆసుపత్రిలో అయ్యే మొత్తం ఖర్చును కూడా తానే భరిస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు.

గోపాల్‌రెడ్డి ఎంపికపై ఎమ్మెల్యే అభినందనలు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి జి గోపాల్ రెడ్డిని సర్పంచ్ గా ఎన్నుకోవడంపై గ్రామస్తులకు నాయకులకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందనలు తెలిపారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు జి గోపాల్ రెడ్డి జరిగిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం ఒకరే బరిలో ఉండడంతో సర్పంచ్ గా ప్రకటించారు. దీంతో సర్పంచ్ గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా అయ్యవారిపల్లి గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి స్వీట్ తినిపించారు. పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అయ్యవారిపల్లి గ్రామానికి ప్రధాన సమస్యగా మిగిలిన వంతెన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తానని సర్పంచ్ గోపాల్ రెడ్డికి తాను అండగా నిలబడతానని ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు. గ్రామంలో అభివృద్ధి కోసమే పార్టీలకు అతీతంగా ఎన్నికలు లేకుండా సర్పంచ్ అభ్యర్థిని ఎనుకునేందుకు సహకరించిన అన్ని వర్గాలకు గ్రామస్తులకు పార్టీ నాయకులకు ఆయన అభినం దనలు తెలిపారు. పనిచేసే అభ్యర్థిని ఎన్నుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

అయ్యవారిపల్లి గ్రామస్తులకు రుణపడి ఉంటాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదేవిధంగా ఎల్లవేళలా రుణపడి ఉంటాను అని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ జి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎంతో నమ్మకంతో తనపై విశ్వాసంతో గ్రామ పెద్దలు ఇతర పార్టీ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున సహకరించి ఎమ్మెల్యే విల్లపల్లి శంకర్ పై నమ్మకంతో తనను సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు వారికి రుణపడి ఉంటానని తెలిపారు. అయ్యవారిపల్లి గ్రామ వాగుపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ ఎంతో పెద్ద మనసుతో ఒప్పుకోవడం త్వరలోనే వాటి పనులను పూర్తి చేస్తానని ఈ శుభ సందర్భంగా చెప్పడం తనకు దక్కిన మొదటి గౌరవంగా భావిస్తానని గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆశీస్సులతో ముందుకు సాగుతానని గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి వెంకటరామిరెడ్డి, చెంది తిరుపతిరెడ్డి బాలరాజు గౌడ్,భగవాన్ దాసు, మహబూబ్, అయ్యవారిపల్లి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దాతృత్వ సేవలో గెజిటెడ్ అధికారులు

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : జిల్లా గెజిటెడ్ అధికారులు దాతృత్వ సేవలోనూ ముందున్నామని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి చెప్పారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘ సభ్యురాలు , టీజీఓఎస్ కేంద్ర సంఘం మహిళా విభాగం కోశాధికారి శాంతి శ్రీ, ఆమె స్నేహితులు కలిసి జిల్లా టీజీఓఎస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శి కె. రామారావు , శ్రీనేష్ కుమార్ నోరి సౌజన్యంతో కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసవించిన నిరుపేద తల్లులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేయుటకు విరాళం యిచ్చారు. ఇందులో 50 శానిటరీ ప్యాడ్‌లు, 2 ఫీడింగ్ నైటీ, 3 లోదుస్తులు, 4 బ్రష్, 5 చిక్కి, 6 బిస్కెట్లు, 7 డైపర్లును కొండాపూర్ ఉదయం ప్రసవించిన తల్లులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం నిరుపేదలకు చాలా ఉపయోగమన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, జిల్లా గెజిటెడ్ అదికారుల సంఘంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంఘం సభ్యులను, కిట్స్‌ను అందజేసిన శాంతి శ్రీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి కొండాపూర్ డిస్ట్రిక్ కో- ఆర్డినేటర్ అనురాగిణి, హెల్త్ సూపరింటెండెంట్ వియజకుమారి, వైద్యులు చంద్రశేఖర్, అనూష సీడీపీవో రోజా, కవిత, తిరుమల, మాధురి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్య, గృహ రుణాలకు ప్రాధాన్యత : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని విద్య, గృహ రుణాలకు బ్యాంక్ అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీ, డిఎల్ఆర్సి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక ప్రణాళిక ప్రకారం ఇచ్చినటువంటి టార్గెట్ ను సంపూర్ణంగా అమలు చేయాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. అదేవిదంగా కొన్ని బ్యాంకుల పర్ఫామెన్స్ చాలా తక్కువగా ఉన్నదని మూడో త్రైమాసిక సమావేశం వరకు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు మోసపోకుండా ప్రజలు,వృద్ధులకు సదస్సుల ద్వారా అవగాహన కల్పించాలని అలాగే బ్యాంక్ అధికారులు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని అకౌంట్ లేని విద్యార్థులకు జీరో అకౌంట్ కు అన్ని బ్యాంకులు సహకరించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 2025-26 ప్రకారం వివిధ రంగాలలో రూ. 420682.07 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, రెండవ త్రైమాసింలో (సెప్టెంబర్ 2025) రూ.. 253493.19 కోట్లు (60.26%)రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో ఎం ఎస్ ఎం ఈ రుణాల లక్ష్యం రూ.115649.26 కోట్లు ఉండగా, రూ.. 57312.17 కోట్లు (48.56%) మంజూరు చేయటం జరిగిందని, అలాగే ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యం రూ. 121798.10 కోట్లు ఉండగా, రూ. 65827.73 కోట్లు (54.05%) మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం వివిధ రుణాలు మంజూరు చేయుచున్నందుకు బ్యాంకర్స్‌ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఎల్డిఓ రెహమాన్, నాబార్డ్ డిడిఎం హర్ష రఘురామ్, ఎల్డియం నరసింహ మూర్తి, వివిధ వాణిజ్య, సహకార మరియు ఆర్ ఆర్ బి బ్యాంకుల కంట్రోలర్స్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగపై విద్యార్థి దశ నుంచే అవగాహన

విశాలాంధ్ర, పటాన్ చెరువు : భారత రాజ్యాంగ విశిష్టతను ప్రతి ఒక్క విద్యార్థులకు సంపూర్ణంగా వివరించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పటాన్ చెరువు బి ఆర్ఎస్ నాయకులు మాదిరి పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. బుధవారం పటాన్ చెరువు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించినా వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి శక్తివంతమైన రాజ్యాంగం భారతదేశంలోనే ఉందని ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేస్తున్న భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవిం చాల్సిందేనని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ఈ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పౌరులకు విశిష్టమైన అధికారాలు,హక్కులను, బాధ్యతలను మనందరికీ రాజ్యాంగం కల్పించిందని సూచించారు. ప్రజాస్వామ్య సార్వభౌమ లౌకిక విధానాలతో భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచిగా ఉందన్న విషయాన్ని విద్యార్థి దశ నుంచే ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపల్ జోసెఫ్ బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని, వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలనీ శేరిలింగంపల్లి యువ నేత, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన కీలక ఘట్టాల్లో కాసోజు శ్రీకాంతాచారి ఆత్మార్పణం ఒకటి అని కొనియాడారు. తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లిలోని ఆయన కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడానికి.. తన శరీరాన్ని ఒక సమిధలా చేసి ఆత్మార్పణం చేసిన కాసోజు శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో చిరకాలం నిలిచిపోతుందని ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంకు ఊపిరిపోసి తన ఊపిరిని తీసుకున్న గొప్ప వ్యక్తి శ్రీకాంతా చారి అని చెప్పారు. తెలంగాణలో నాడు సీఎంగా కెసిఆర్ అమరవీరుల త్యాగాన్ని గుర్తించి సెక్రటేరియేట్ ఎదురుగా అమరుల స్మృతి కేంద్రాన్ని నిర్మించారని గుర్తు చేసారు. తెలంగాణ కోసం నిరంతరం కష్టపడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే అని రవీందర్ యాదవ్ తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. రవీందర్ యాదవ్, బిఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గంగారాం సంగారెడ్డి ముద్దంగుల మల్లేష్ యూవజన నాయకులు గణేష్ రెడ్డి సామజికవేత్తలు నరాల మహేష్ రెడ్డి వేంకటేశ్వర్ రావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రుచులకు చిరునామాగా 'కంచి కేఫ్'నిలవాలి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కంచి కేఫ్‌ను పీఏసీ చైర్మన్ శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేంద్ర యాదవ్ , గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్వితీయ రుచులకు చిరునామాగా "కంచి కేఫ్ నిలవాలన్నారు. రుచికరమైన టిఫిన్స్ అందిస్తూ చుట్టుపక్కల వినియోగదారుల మన్ననలను పొంది దినదినాభివృద్ధి చెందాలన్నారు. సొంతంగా వ్యాపారం చేయడం కాకుండా పదిమందికి ఉపాధి కల్పించడం మంచి పరిణామం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో,యువత స్వయం ఉపాధి పొందే మార్గం వైపు రావడం జరుగుతుందన్నారు. తదనంతరం కంచి కేఫ్ యాజమాన్యం కి శు భాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు శ్రీనివాసరాజ్ ముదిరాజ్, మంత్రి సత్యనారాయణ,వసంత్ కుమార్ యాదవ్,జలేందర్ రెడ్డి, దొర బాబు, శ్రీరాములు ,శేఖర్ ప్రభాకర్,

తిరుపతి,రంగస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, గిరి, రాజు, శ్రీను, నర్సింగ్ రావు, గోవింద్, నాగేష్, బాబు,స్థానిక నేతలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధి స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన వసుపుల మహేందర్ కూతురు వసుపుల నేహ పుట్టినరోజు సందర్భంగా నందిగామ మండలం, అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు దేవాలయంలో అయ్యప్ప స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతలకు అయ్యప్ప సేవా సమితి వారు ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రూశ్వములు సుదర్శన్ గౌడ్, హరిజీవన్, నర్సింహా, వసుపుల నెనిస్, శ్రీకాంత్, స్వాతి, శివకుమార్ గౌడ్, కృష్ణ, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మలాకర్ శర్మ బెయిల్ రద్దు చేయాలి : ప్రసాద్ శర్మ

విశాలాంధ్ర, బషీర్ బాగ్: వేలాది మంది బ్రాహ్మణ వృద్ధుల డబ్బులు తీసుకుని మోసం చేసి స్వంతానికి వాడుకున్నట్లుగా రుజువు అయ్యిందని, హైకోర్టులో సైతం కమలాకర్ శర్మను గట్టిగా ప్రతిఘటిస్తున్నామని ధన్వంతరి విక్టిమ్స్ ఫోరమ్ కన్వీనర్ గిరి ప్రసాద్ శర్మ అన్నారు. త్వరలో హైకోర్టులో గెలుస్తామని, హైకోర్టులో కేసు గెలిచినా వెంటనే అతని బెయిల్ రద్దు చేసి ఉరి శిక్ష వెయ్యాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అటాచ్ చేసిన ధన్వంతరి ఆస్తులను అన్ని సిసిఎస్ పోలీసులు వేలం వెయ్యాలని, ఇప్పటికే చాల సమయం వృధా అయ్యిందిఅని తెలియ చేశారు. అంబర్ పెట్ హాస్పిటల్ ఒక దగా అని హాస్పిటల్ పేరుతొ వసూలు చేసిన కోట్లాది రూపాయలను తన భార్య జయశ్రీ పేరుతొ షేర్ లు కొని ఆమె పేరుపై ఆసుపత్రి నిర్మించాలని నిందితుడు కుట్ర చేసాడని, అది ఫలించక పోగా జైలుకే వెళ్లాడని గిరి ప్రసాద్ శర్మ తెలిపారు.

వైభవంగా 18వ మహా పడిపూజ

విశాలాంధ్ర, పటాన్ చెరువు :స్వామియే శరణమయ్యప్ప, స్వామియే శరణమయ్యప్ప అను శరణు ఘోషలతో పటాన్ చెరువు పట్టణం మార్మోగింది. రాజబోయిన సంతోష్ యాదవ్, మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ పట్టణంలో అంగరంగ వైభవంగా సాగింది. పట్టణంలోని స్థానిక భారత్ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న విశాలమైన ప్రాంగణంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మండపాన్ని కనుల పండుగ ఏర్పాటు చేశారు. స్వామి వారి గాలిగోపురం భక్తులను విశేషంగా ఆకర్షించింది. అయ్యప్ప స్వామి అభిషేకంతో స్వామివారి పూజా కార్యక్రమం ప్రారంభించారు. గురుస్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో 18వమహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి సోత్రాలతో ప్రాంగణం మార్మోగింది. కన్నె స్వాముల నృత్యాలు గురుస్వాముల భజనలతో ఆలపించిన అయ్యప్ప స్వామి భక్తి గీతాలు భక్తులను విశేషంగా అల్లరించాయి. సుమారు 4000 వేల మంది అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదాలను అందించేందుకు రాజు బోయిన కుమార్ యాదవ్, కృష్ణ యాదవ్ లు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆధ్యాత్మిక చింతన చాలా అవసరమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ఒత్తిడి దూరమవుతుందని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు. స్వాములందరూ అయ్యప్ప స్వామి దీక్ష విరమించిన తర్వాత నిజజీవితంలో మంచి క్రమశిక్షణతో స్పష్టమైన ఆహార నియమాలతో జీవించేందుకు అయ్యప్ప స్వామి దీక్ష అందరికీ తోడ్పడుతుందని వివరించారు. పటాన్ చెరువు నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ఎస్ నాయకులు, పృథ్వీరాజ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, చిట్టబోయిన లడ్డు యాదవ్, గురుస్వాములు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, రాము గుప్తా, వీరేష్, సతీష్ గౌడ్, మణికంఠ, సాయి, ప్రమోద్ భక్తులు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : దివ్య మురళీధర్‌రెడ్డి

విశాలాంధ్ర - మొయినాబాద్: గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అంతి రెడ్డి దివ్య ముర ళీధర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామ పంచాయతీ సర్పంచ్ నామినేషన్ వేసిన అనంతరం గ్రామంలో గ్రామస్తులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని వెల్లడించారు. ప్రత్యేకించి గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి సేవ చేస్తానని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ముందుకుసాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : గొడుగు

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఆశీర్వదించండి... గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థి గొడుగు యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలన్నారు. గ్రామాభివృద్ధి ధ్యేయంగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తూ, గ్రామప్రజల సేవకుడిగా పని చేస్తూ, పారదర్శకపాలన, సమాన అభివృద్ధి కోసం పని చేస్తానని చెప్పారు. ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ప్రతి కుటుంబానికీ మేలు చేసేలా గ్రామంలోనే ఉంటూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని వెల్లడించారు. ప్రజల ఆశీర్వాదమే తన గెలుపే అని తెలిపారు. ఒక్కసారి సర్పంచ్‌గా తనకు అవకాశం కల్పించి, గెలిపించి, ఆశీర్వదించండి అని ప్రజలను కోరారు. గ్రామ ప్రజల సమిష్టి కృషితో అభివృద్ధి చేస్తామన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టులో

O.S. No. 237 / 2024

బిట్వీన్ :
యాంపాటి అనంతరామిరెడ్డి ...వాది.
వర్సెస్,
తాటిపర్తి అరుణ కుమారి ....ప్రతివాది.

To,
తాటిపర్తి అరుణకుమారి, భర్త లక్ష్మీ రవి బాబు, ఫ్లాట్ నెం.904,B-బ్లాకు, వివిఎఆర్ సెలెస్టియల్ టవర్, చిట్టారామ్మగుడి దగ్గర, గాజుల రామారాం -500055, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. సెల్ నెం : 9121979563.

పై దావా నందు ప్లయింట్ పరిహారం నిమిత్తం మీరు ది.26/12/2025న స్వయం గాను లేదా అడ్వకేట్ ద్వారా హాజరు అగుటకు వాయిదా ఉన్నది. కావున ది.26/12/2025న ఉ॥గం॥ 10:30ని॥ హాజరుకావలసినదిగా తెలియజేయ డమైనది. అట్లు మీరు హాజరుకాని యెడల పై దావ మీ పరోక్షమందు తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

వాయిదా ది. 26/12/2025.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గట్ల సత్యనారాయణరెడ్డి,
వాది తరపున న్యాయవాది, మాచర్ల-522426.
సెల్ నెం: 9440207657.

19 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రెండు ఫేసుల్లో వేసిన నామినేషన్లు ఉపసంహరణ గడువు ముగియడంతో ఏకగ్రీవమైన పంచాయితీలు వార్డు సభ్యుల వివరాలు వెల్లడి అయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఫేస్ -1 లోని మొత్తం 192 గ్రామ పంచాయతీలకు కొన్ని గ్రామపంచాయతీల్లో సర్పంచ్, అన్ని వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బోనకల్ మండలంలోని కలకోట గ్రామపంచాయతీ

చింతకాని మండలంలోని రాఘవాపురం మరియు రేపల్లెవాడ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మధిర మండలంలోని సిద్దినేనిగూడెం, సైదల్లిపురం గ్రామపంచాయతీలు, వైరా మండలంలోని లక్ష్మీపురం, గోవిందాపురం, నారపునేనిపల్లి గ్రామపంచాయతీలు, రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లి, రేగుల చలక, మంగ్య తండా, రాములు తండా గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. అదేవిధంగా ఎర్రుపాలెం మండలంలోని గోసవీడు, చొప్పకట్లపాలెం, జమలాపురం, కంద్రిక ,గట్ల గౌరారం, కాచవరం గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఫేసు-2 మొత్తం 192 సర్పంచ్‌లకు గాను 19 సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ,మిగిలిన గ్రామ పంచాయతీలు: 547 గ్రామపంచాయతీలలో సర్పంచు పోస్టులకు ఎన్నిక జరగనుంది.

ఫేజ-3లో 1740 వార్డులకు గాను , 220 వార్డు ఏకగ్రీవం ఎన్నిక కాగా, మిగిలిన 1520 వార్డులకు ఎన్నిక జరగనుంది. మొత్తం మీద గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది.

చిన్నారిని ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన రామగిరి దుర్గాభవాని-జగదీష్ కూతురు ఐశ్వర్య నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకకు చిన్నారిని ఆశీర్వదించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు మహిళా సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూర్య సీతక్క హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా కార్మికశాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, చల్వాయి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మేకల రాధ, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతులకు రైతురత్న అవార్డులు

విశాలాంధ్ర-కొత్తూరు : నందిగామ మండలం, కన్హ శాంతి వనంలో బుధవారం మహాకిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఏషియన్ పిజిపి ఆర్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎంఎస్‌రెడ్డి, ఇఫ్కో చైర్మన్ యోగేందర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుండి సుమారుగా 5000 మంది అభ్యుదయ రైతులు, వివిధ సంస్థల శాస్త్రవేత్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రకాల వ్యవసాయ జీవ మరియు రసాయన ఉత్పత్తుల విభాగాలు, తెలంగాణ వ్యవసాయ, అనుబంధ శాఖల వారు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులలో అధిక దిగుబడులు సాధించిన 17 మంది అభ్యుదయ రైతులను తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం తరఫున రైతు రత్న అవార్డులతో సత్కరించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ తాను సేంద్రియ వ్యవసాయం 40 సంవత్సరాల నుండి అవలంబిస్తున్నానని, దీనివలన నేలను

సంరక్షించుకోవచ్చని, అలాగే రైతు సోదరులు యూరియా వాడాలి తగ్గించి సేంద్రియ వ్యర్థ పదార్థాలు, జీవవనరులను వాడి వ్యవసాయం చేసినట్లయితే అధిక ఉత్పత్తులు సాధించి నేలను సంరక్షించుకోవచ్చని సూచించారు. తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశంలో రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయంలో ప్రోత్సహించుటకు తీర్మానం చేయవలసిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి కృపాకర్ రెడ్డి, శాస్త్రవేత్త సూదిని హరికిషన్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి కృపాకర్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ డి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఎస్ యాదగిరి సాయి, రమేష్, మాధవరెడ్డి, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయకుంటే...

తీవ్రస్థాయిలో పోరాటం

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరిక

- విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర...ధర్నాచౌక్ వద్ద దీక్ష
- యాజమాన్యం కుట్రలను తిప్పికొట్టాలి
- అగ్రి ఆస్తుల వేలం వేగవంతం చేయాలి
- సీఎం చంద్రబాబు సమస్య పరిష్కరించాలి
- ఒక్క బాధితుడు మరణించినా ప్రభుత్వానిదే బాధ్యత
- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన బాధితులు విజయవాడ రైల్వేస్టేషన్ నుండి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్ర నిర్వహించారు. ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినదించారు. నిరసన యాత్ర ముగిసిన అనంతరం ధర్నాచౌక్ వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు ఈవి నాయుడు అధ్యక్షతన అవేదన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన పట్టువీడకుండా వేలాదిమంది పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో కొంతమేర విజయం సాధించగలిగామన్నారు. దీంతో సుమారు 1.43 లక్షల మందికి రూ.10వేలు, రూ.20వేలు చొప్పున బాధితులకు అందాయన్నారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక దాదాపు 1100మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, అందులో 127మందికి ఎటువంటి రిపోర్టులు లేకుండా పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. కంపెనీలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేసినవారు 10లక్షలకు పైగా ఉన్నారని వారికి న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. చావోరేవో తేల్చుకునే వరకు వెనకడగు వేయకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. కొంతమంది కంపెనీ యాజమాన్య అనుకూల వ్యక్తులు సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని... అది వారి విజ్ఞతకే వదిలేద్దామన్నారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించే వరకు దాదాపుగా 12 సంవత్సరాల నుండి అనేక రూపాల్లో ఉద్యమిస్తున్నామన్నారు. ఇలాంటి ఉద్యమం ఇప్పటివరకు దేశంలోనే జరగలేదని స్పష్టం చేశారు. అసోసియేషన్ పోరాట ఫలితంగా సంస్థకు సంబంధించిన 14వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ ఆస్తిని మ్యుటేషన్ చేయకుండా కోర్టులో కేసులు వేసి కంపెనీ యాజమాన్యం అడ్డుకుంటోందని... యాజమాన్యం ఆటలను సాగనివ్వమని తీవ్రంగా తిప్పికొడతామని ముప్పాళ్ల హెచ్చరించారు. అసోసియేషన్ నిబద్ధతతో అగ్రిగోల్డ్ బాధితుల పక్షంగా పోరాడుతోందని స్పష్టం చేశారు. సీఐడీలో నిజాయితీ గల అధికారులు బాధితులకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. బాధితుల పక్షంగా నిలబడిన అసోసియేషన్‌కు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కస్టమర్లను, ఏజెంట్లను ఇప్పటికీ మోసం చేస్తున్న సంస్థ యాజమాన్యం అవ్వా వెంకట రామారావు, అవ్వా వెంకట శేషు నారాయణను ఇతర ప్రతినిధిల ఇళ్లను ముట్టించాలని పిలుపునిచ్చారు. బాధితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆస్తులను వేలం వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. బాధితుల్లో ఏ ఒక్కరు మరణించినా ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని ముప్పాళ్ల స్పష్టం చేశారు. అధికారంలో లేనప్పుడు పవన్ కల్యాణ్ అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశమై న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కన్నా ప్రపంచంలోని కోటీశ్వరుల అభివృద్ధి కోసం ఎక్కువగా పనిచేస్తున్నారని కార్పొరేట్ చంద్రబాబుగా పిలిచే పరిస్థితి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి రాబోయే రోజుల్లో బాధితులను కూడగట్టుకుని 10వేల మందితో రహదారులపై వంట వార్పుతో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన అర్థం చేసుకుని సమస్య పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు మాట్లాడుతూ ఉద్యమాన్ని ఆస్తులను కంపెనీ యాజమాన్యం స్వాధీనం చేసుకునే స్థాయికి తీసుకువచ్చామన్నారు. సీఐడి అధికారులు బాధితుల పక్షంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. బాధితులను ఇబ్బందిపెడుతున్న యాజమాన్యానికి ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ చేసిన అన్యాయంతో పిల్లల చదువులు, వివాహాలు చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ కర్నాటక అధ్యక్షుడు కె గురుమూర్తి మాట్లాడుతూ సంస్థ ఆస్తులకు విపరీతమైన విలువ పెరిగిందని 2015 లో రూ.6వేలు కోట్లు ఉన్న ఆస్తులు, ప్రస్తుతానికి రూ.30వేల కోట్లకు చేరుకున్నాయని... ఆస్తుల విలువ పెంచుకునే పనిలో కంపెనీ యాజమాన్యం ఉందని తెలిపారు. ఈ ఆస్తులను కాపాడుకునేందుకు కొంతమందిని అడ్డంపెట్టుకుని కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు. దీంతో బాధితులకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. త్వరలో సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉంటుందని, ఎవ్వరు ఆపలేరని దేనికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లికార్జునరావు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ రజిత, కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, ఒడిశా అసోసియేషన్ కార్యదర్శి ఐ.చంద్రరావు, తమిళనాడు నాయకురాలు ఆశాబేగం, అసోసియేషన్ నాయకులు

జంగాల ఆజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు తదితర నాయకులతో పాటు తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, రాష్ట్ర నలుమూలల నుండి ఏజెంట్స్, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్కార్! ఇక మేలుకో!!

ప్రజల గోడు విను... సమస్యలు పరిష్కరించు

పార్లమెంటులో సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూఢిల్లీ: 'సర్కార్! ఇప్పటికైనా మేలుకో. ప్రజల గోడు విను. అర్థం చేసుకో. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే తగు సమర్థ చర్యలు తీసుకో' అంటూ సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ పార్లమెంటును దద్దరిల్లించారు. కేంద్రీకరణ, ప్రైవేటీకరణ మోజులో సంస్థలను నాశనం చేస్తున్నదని ప్రభుత్వాన్ని ఆక్షేపించారు. దేశ యూరివర్సిటీ, కాలేజి టీచర్ల ఆవేదన, ఆగ్రహాన్ని తన మాటల్లో సభకు తెలియజేశారు. ఆగని దోపిడీ, సంస్థాగత నిర్లక్ష్యంపై గొంతెత్తారు. వీటికి వ్యతిరేకంగా ఏఐఎఫ్ యూసీటీఓ ఈనెల 9న దిల్లీ నుంచి దేశవ్యాప్త ఆందోళనను దిగుతోందని తెలిపారు. మంజూరైన మూడు లక్షల టీచర్ పోస్టులు భర్తీకి నోచుకోలేదని, అర్హులైన యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని సంతోశ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 6.5 లక్షల మంది టీచర్లు అడ్-హాక్‌లో చిక్కుకుపోయారని, ఒప్పంద నియామకాలతో గౌరవ ఉపాధికి దూరమై, అభద్రతా భావంతో న్యాయమైన ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. మళ్లీ టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాలంటూ విధుల్లో ఉన్న టీచర్లపై ఒత్తిడి తెచ్చే తిరోగమన విధానాలను యూజీసీ అవలంభిస్తోందని సీపీఐ ఎంపీ విమర్శించారు. ఇలాంటి విధానాలను సీపీఐ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సామాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన ఎన్ఈపీ 2020 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏడవ వేతన సవరణను ప్రస్తావించారు. దాని ప్రయోజనాలు అందరికీ సమానంగా అందడం లేదన్నారు. పింఛన్‌దారులకు అన్యాయం జరుగు తోందని తెలిపారు. తమ జీవితాలను విద్యా రంగానికి అంకితమిచ్చిన వారి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సంతోశ్ దుయ్యబట్టారు. కేంద్రీకరణ కోసం ప్రభుత్వం పట్టుదలగా ఉండి, వ్యవస్థలను నాశనం చేస్తున్నదన్నారు. రాష్ట్రాల సాధికారతకు విఘాతం కలిగిస్తుందని, టీచర్లను, విద్యార్థులను అణచివేస్తున్నదని వ్యాఖ్యానించారు. అధ్యాపకులు దేశానికి మూలస్తంభాలని, వారి పోరాటం అత్యవసరం, న్యాయమైనదని అన్నారు. సర్కారు ఇప్పటికైనా మేల్కొనాలని, ప్రజల పక్షం వినాలని, తగు చర్యలను తక్షణమే తీసుకోవాలని సంతోశ్ కుమార్ హితవు పలికారు.

పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి

నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఏపీ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆ పదవికి అనర్హుడని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ బుధవారం అన్నారు. పవన్ కల్యాణ్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టేవిగా, ఐక్యతకు భంగం కలిగించేవిగా ఉన్నాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినా అందరూ కలిసే ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భీమవరానికి చెందిన వారు తమ కుమార్తెను ఇచ్చి వివాహం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ తొలి రోజుల్లో చేగువేరా తనకు ఆదర్శం అన్నారని, ఇప్పుడు సావర్కర్‌ను భుజాన వేసుకుని తిరుగుతూ సనాతన ధర్మం అంటున్నారని విమర్శించారు. సనాతన ధర్మం కోసం తిరగాలనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని, రాజకీయాల్లో ఉండకుండా ఆ పని చేసుకోవచ్చని చురకలు వేశారు. సనాతన ధర్మం చెప్పే దిష్టి తగిలింది లాంటి మాటలు మాట్లాడే సనాతన వాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగడని, తక్షణమే ఆయనను ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

పచ్చదనం ఉట్టిపడేలా అమరావతి

- ప్రత్యేక ప్రణాళికలు
- 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ రాజధానిగా నిర్మాణం
- ల్యాండ్ పూలింగ్ రైతుల కోసం సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్: మంత్రి నారాయణ

విశాలాంధ్ర-సచివాలయం: రాజధాని అమరావతిలో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఎకో రిసార్ట్స్, మ్యూజికల్ ఫౌంటెయిన్స్, స్నోవరల్డ్ వంటివి ఏర్పాటు చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలు,రోడ్ల పనులతో పాటే పచ్చదనం అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. అమరావతిలో పచ్చదనం అభివృద్ధిపై రాయపూడిలోని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలో అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష చేసిన మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ అమరావతిలో ట్రంక్ రోడ్లు,ఎల్పీఎస్ జోన్లలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్ మధ్య, రిజర్వాయర్ల చుట్టూ పచ్చదనం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 217 చ.కిమీ మాస్టర్ ప్లాన్ లో బ్లూ అండ్ గ్రీన్ కు 30 శాతం కేటాయించామని తెలిపారు. 34 ట్రంక్ రోడ్లకు ఇరువైపులా 640 కిమీ, సెంట్రల్ డివైడర్ ల మీద 450 కి.మీ మేర బ్యుటిఫికేషన్, 22 ట్రంక్ రోడ్ల బఫర్ జోన్ లలో 133.31 కి.మీ మేర అవెన్యూ ప్లాంటేషన్, ఎల్పీఎస్ జోన్ల వద్ద 1244 కి.మీ మేర పచ్చదనం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. శాఖమూరులో 190 ఎకరాల్లో, మల్కాపురం వద్ద 21 ఎకరాల్లో పబ్లిక్ రిక్రియేషన్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతవరం వద్ద 31 ఎకరాల్లో లంగ్ స్పేస్ పార్కులు,కురగల్లు వద్ద 200 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కు, ఎల్పీఎస్ జోన్లలో 1602 ఎకరాల మేర ఎకరం నుంచి పదెకరాల లోపు విస్తీర్ణంలో పార్కులు నిర్మిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. కృష్ణాయపాలెం రిజర్వాయర్ వద్ద 71 ఎకరాలు, నీరుకొండ రిజర్వాయర్ వద్ద 158 ఎకరాల్లో పచ్చదనం అభివృద్ధి చేస్తున్నామన్నారు. శాఖమూరు పార్కులో 30 ఎకరాల్లో అమ్యూజ్ మెంట్ పార్కు అభివృద్ధి రిజర్వాయర్ లలో బోటింగ్ డక్,మ్యూజికల్ ఫౌంటెయిన్ అలాగే ఎడ్వంచర్ పార్క్ లో స్నో వరల్డ్,ఎకో రిసార్ట్స్ లో 10 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్లు,రెస్టారెంట్స్,బోటింగ్,కాటేజీలు,పబ్లిక్ పార్క్ లో 30 ఎకరాల్లో సైక్లింగ్, వాకింగ్, మ్యూజికల్ ఫౌంటెయిన్ నర్సరీ లో గ్లాస్ డోం ఉండేలా థీమ్ పార్క్ లు,డిస్ ప్లే అండ్ షాపింగ్,కిడ్స్ ప్లే ఏరియా, 20 ఎకరాల్లో ఫ్లవర్ పార్క్ లో దశావతార ఫ్లవర్ గార్డెన్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని ఈ పనులన్నీ జనవరినెలాఖరు నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

రాజధానికి భూములిచ్చి ప్లాట్లు పొందిన రైతులను వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఫోన్ ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు కేటాయించగా ఇంకా కేవలం 2168 మంది రైతులకు 7743 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. లంక, అసైన్డ్ ప్లాట్లకు సంబంధించి ఇంకా 157 మంది రైతులకు 295 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. కొంతమంది రైతులు రిజిస్ట్రేషన్ కోసం మరింత సమయం కావాలని కోరుతున్నారు. ఇంకా రైతులకు 719 ఎకరాల మేర ప్లాట్లు కేటాయించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం 900 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఆయా పనులకు సంబంధించి సర్వే జరుగుతుందన్నారు. ఇక రైతులకు కేటాయించిన ప్లాట్లలో సరిహద్దు రాళ్లు కూడా త్వరలోనే వేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు,స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం మరికొంత భూమి అవసరం అవుతుందన్నారు .దీనికి సంబంధించి అధికారులు కసరత్తు జరుగుతుందని మంత్రి చెప్పారు.గతంలో మాదిరిగా ల్యాండ్ పూలింగ్ పై రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు.

చెరో 10 గంటలు

వందేమాతరం, ఎన్నికల సంస్కరణపై చర్చ

న్యూఢిల్లీ: వందే మాతరం, ఎన్నికల సంస్కరణలపై చర్చకు చెరో 10 గంటల సమయాన్ని రాజ్యసభ బీఏసీ కేటాయించింది. వచ్చే వారంలో ఈ చర్చలు ప్రారంభమవుతాయి. బీఏసీ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. వందే మాతరానికి 150 ఏళ్లు అయిన సందర్భంగా జాతీయ గీతంపై మంగళవారం రాజ్యసభలో చర్చ ప్రారంభం కాబోతోంది. ఈ మేరకు సమావేశం నిర్ణయించిందని బీఏసీ వర్గాలు తెలిపాయి. వందే మాతరంపై చర్చ ముగిసిన తర్వాత ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ మొదలవుతుంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన రెండు రోజులలో ఎస్ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సభలు రసాభాస అయ్యాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు వీల్లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇదే క్రమంలో ఎన్నికల సంస్కరణలపై చర్చను ప్రతిపక్షాలు కోరాయి. ముందుగా వందే మాతరంపై చర్చ కోసం ప్రభుత్వం ప్రతిపాదిం చగా, విపక్షాలు ఒప్పుకున్నాయి. దీంతో వందే మారతం, ఎన్నికల సంస్కరణలపై వచ్చే వారం చర్చ కోసం చెరో 10 గంటలు కేటాయించారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కండి

జనసేన శ్రేణులకు పవన్ పిలుపు

గ్రామ స్థాయిలో ఐదుగురితో కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజక వర్గం వరకూ అభివృద్ధిలో భాగం కావాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ ప్రాంత అభివృద్ధిలో, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్తామని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించడం ద్వారా వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామన్నారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. బుధవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు. మిగిలిన పదవుల భర్తీపై సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతో పాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా ప్రయాణిస్తున్నామన్నారు.పార్టీ కమిటీల నియామకంపై పవన్ కళ్యాణ్ పలు సూచనలు అందించారు. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు ఐదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు.ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్‌గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైందని, ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలని పవన్ స్పష్టం చేశారు. ఈ విభాగంలో 11 మంది వరకూ సభ్యులను నియమించాలని నిర్ణయించారు. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధ్యక్షుల దిశానిర్దేశం చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు.

వైద్య విద్య ప్రైవేటీకరణతో వ్యవస్థ ఛిద్రం

కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్న కూటమి సర్కార్: ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలకులు విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పజెప్పడంతో సామాజిక వ్యవస్థ ఛిద్రమవుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారి భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బుధవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నరేంద్రమోదీ సర్కారు ప్రభుత్వ రంగాలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతుండగా... మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రానికి తామేమీ తీసిపోమన్నట్లుగా విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఈశ్వరయ్య విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగం మెరుగుదల కేవలం మాటలకే పరిమితమైందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయకుండా... విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకుండా విద్యారంగాభివృద్ధి ఎలా సాధ్యమో పాలకులే చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యనందించాలనే లక్ష్యం కేవలం మాటలకే పరిమితమైందని, పాలకుల వాగ్దానాలు అమలుకు నోచుకోక కంటితుడుపు చర్యగానే మిగులుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ విద్యావ్యవస్థను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నాయని మండిపడ్డారు. చదువు కేవలం ర్యాంకులకే పరిమితమవుతూ విద్యార్థులలో సామాజిక అవగాహన, పరిజ్ఞానం వంటివి కొరవడే పరిస్థితి దాపురిస్తున్నదని పేర్కొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటీకరణ దుర్మార్గం

ప్రజలకు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించడం ప్రభుత్వాల బాధ్యతని, దీనికిబదులు వాటిని దశలవారీగా ప్రైవేటీకరించాలనుకోవడం దుర్మార్గమని ఈశ్వరయ్య మండిపడ్డారు. ప్రభుత్వ అధీనంలో కొనసాగాల్సిన వైద్యరంగాన్ని దశలవారీగా ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. నూతనంగా ఏర్పాటుచేసే 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పీపీపీ పేరుతో 33 సంవత్సరాల పాటు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం జీవో 107, 108 ద్వారా వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో బీ, సీ కేటగిరీలుగా విభజించి... బీ కేటగిరి రూ.12 లక్షలకు, సీ కేటగిరి రూ.20 లక్షలకు విక్రయిండంతో ప్రతిభల గల పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరమయ్యారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం కూడా జీవో నంబరు 107, 108ని రద్దు చేయకుండా... 2024-25, 2025-2026లో గత ప్రభుత్వం మాదిరిగా సీట్లను భర్తీ చేసిందన్నారు. 10 వైద్య కళాశాలలను పూర్తిగా ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులేస్తూ... 765 ఎకరాల ప్రభుత్వభూమిని ఎకరా రూ.100కే కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టిందని, ప్రభుత్వాసుపత్రులలో ఖాళీగా ఉన్న నర్సులు, పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, ప్రొఫెసర్లను భర్తీ చేయకపోవడం వలన ప్రజలకు నాణ్యమైన వైద్యం కరువైందని పేర్కొన్నారు.

పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు

ప్రైవేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం చేసుకున్న వారికి వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఫలితంగా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణ అందని ద్రాక్షగా మారిందని ఈశ్వరయ్య ఆందోళన వెలిబుచ్చారు. దీనికితోడు పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లిలోని నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) టెండర్లు పిలిచిందన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సెల్ మార్గదర్శకాల ప్రకారం కొత్తగా బోధనాసుపత్రి ప్రారంభించాలంటే కనీసం 25 ఎకరాల భూమి అవసరం. కోట్లాది రూపాయలు వెచ్చించి 320 పడకలతో, ఆసుపత్రిలో అనేక విభాగాలు నెలకొల్పడం, సిబ్బందిని నియమించి ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతోపాటు ఎన్ఎంసీ అనుమతి పొందిన మీదట తరగతులు ప్రారంభించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అత్యుత్సాహంతో వందల కోట్ల పెట్టుబడిగానీ, కాలయాపనగానీ లేకుండా రెడీమేడ్‌గా బోధనాసుపత్రులను ప్రైవేటు సంస్థలు పొందేందుకు వీలవుతున్నదని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలను రెండేళ్లపాటు ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ, అందులో పనిచేసే వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ ఖజానా నుంచే వేతనాలు చెల్లించాలని చంద్రబాబు సర్కార్ చూడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రైవేటు శక్తులకు లాభం చేకూర్చే విధంగా వందల కోట్ల ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం దోచిపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రతిపాదనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

కనిష్ట స్థాయికి రూపాయి పతనం

ముంబై: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి... రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడయింది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో (జనవరి-ఫిబ్రవరి) రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది. 2025 జనవరి మధ్య నాటికి రూ.86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ.87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ.88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ.89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలు చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ.89.26- రూ.89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.